

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 27 జూన్ 2021 సంపుటి : 02 సంచిక :337 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఆత్మకూరు నియోజకవర్గానికి త్వరలో

# మరో రెండు భారీ ప్రాజెక్ట్ లు

**రూ.264 కోట్లతో ఆత్మకూరులో అభివృద్ధి పనుల పరుగులు**

**నియోజకవర్గ అభివృద్ధి కోసం నా శాయశక్తులా కృషి చేస్తా**

**చేజర్ల మండల స్థాయి సమీక్షలో మంత్రి మేకపాటి**



నెల్లూరు ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి తన శాయశక్తులా కృషి చేస్తానని పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి మరోసారి పునరుద్ఘాటించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పరిశ్రమల శాఖ ద్వారా 2 భారీ ప్రాజెక్ట్ లు రానున్నాయని, వాటి ద్వారా నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రమైన చేజర్లలో ఆయన మండల ఆభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ గణేష్, డ్వామా పీడీ తిరుపతయ్య, ఆత్మకూరు ఆర్డీఓ ఏ. చైత్రవర్షిణిలతో కలసి మండలస్థాయిలో నిర్వహించిన ఈ సమీక్షలో వివిధ ప్రభుత్వ శాఖలలో జరుగుతున్న పనులను ఆయా ఆధికారులతో సమీక్షించారు. ఆత్మకూరు నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనుల కోసం ఏడాదిన్నర వ్యవధిలో రూ.264 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఆయితే ఆయా పనులలో జరుగుతున్న ఆలస్యమవుతుండడంపై పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ఆసంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత కోవిడ్ వ్యాప్తి, తీసుకున్న చర్యల గురించి వివరాలు ఆడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 11,588 మందికి కోవిడ్ వ్యాక్సినేషన్ చేసినట్లు పీ హెచ్ సీ డాక్టర్ వెంకటాచలపతి వివరించారు. కరోనా వైరస్ మూడో విడత విజృంభణ రానుండడం పట్ల తీసుకునే ముందస్తు జాగ్రత్తల గురించి అధికారులకు మంత్రి గౌతమ్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కోవిడ్ వ్యాక్సినేషన్ 2 డోసులు వేయించుకుంటే ఎదుర్కోవడం సులభమవుతుందని అన్నారు. ఈ విషయంలో ఆరోగ్య సిబ్బంది చొరవ చూపి నూరు శాతం వ్యాక్సినేషన్ అయ్యేలా చూడాలన్నారు. నాడు నేడు పనుల గురించి పంచాయతీరాజ్, విద్యాశాఖ ఆధికారులతో మాట్లాడుతూ తొలి విడతలో 21 పాఠశాలలను నాడు నేడు పనులు 88 శాతం పూర్తి అయినట్లు ఆధికారుల ద్వారా తెలుసుకున్నారు. రెండో విడతలో 17 పాఠశాలలు నమోదు చేస్తే 14కే మంజూరయ్యాయని ఎంఈఓ కళాధర్ తెలపడంతో మిగిలిన మూడు పాఠశాలలు వెంటనే చేర్చాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

గ్రామాల్లో పాఠశాలల్లో జరిగిన నాడు నేడు పనుల వివరాలను ఆడిగి తెలుసుకున్నారు. ఫర్నిచర్, టీవీలు, నోటు పుస్తకాలు 80 శాతం చేరాయని అధికారులు వివరించారు.పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సచివాలయాలు, పాల శీతలీకరణ కేంద్రాలు, ఆర్బికె, విలేజ్ క్లినిక్ భవనాల నిర్మాణాల్లో తీవ్ర ఆలస్యమవుతుండడంతో ఆయన ఆసహనం వ్యక్తం చేశారు. నిధులు మంజూరైన అధికారుల ఆలసత్వమా, పర్యవేక్షణ లోపమా అని ప్రశ్నించారు. పలు చోట్ల సిమెంటు సక్రమంగా ఆందడం లేదని ఏజెన్సీలు తెలపడంతో ఆయన ఆ విషయం వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని ఆదేశించారు. బిల్లుల విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని, తానే స్వయంగా పరిశీలించి వెంటనే మంజూరయ్యేలా చూస్తానని హామి ఇచ్చారు.


# అయోధ్య అభివృద్ధిపై మోదీ సమీక్ష

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య అభివృద్ధిపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమర్పించిన ప్రణాళికను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం సమీక్షించారు. అంతర్జాతీయ పర్యాటక ప్రాంతంగా అయోధ్యను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ ప్రణాళికను రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన టౌన్‌షిప్, టూరిజం బోర్డు, విమానాశ్రయం, సరయూ నదీ తీర ప్రాంత అభివృద్ధి, రామాలయం నిర్మాణం, రామాలయం నుంచి రోడ్డు వరకు అనుసంధానం గురించి ఈ ప్రణాళికలో వివరించారు. ఈ సమీక్ష వర్చువల్ పద్ధతిలో జరిగింది.అయోధ్య సర్వతోముఖాభివృద్ధి కోసం బ్లూప్రింట్, విజన్ డాక్యుమెంట్‌లను తయారు చేసేందుకు అంతర్జాతీయ కన్సల్టెంట్ సంస్థ అయిన ఎల్‌ఈఏ అసోసియేట్స్ సౌత్



ఆసియా ప్రైవేట్ లిమిటెడ్‌తో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అభివృద్ధి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 27 ప్రాజెక్టుల జాబితాను సమర్పించింది. వీటిలో 10 ప్రాజెక్టులకు సంబంధించిన సవివరమైన నివేదికలను త్వరలోనే తయారు చేయనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, అభివృద్ధి మండలి చైర్‌పర్సన్ దీపక్ కుమార్ చెప్పారు. అయోధ్యను దేశంలోని అన్ని ప్రాంతాలకు అనుసంధానం చేయడం కోసం రూ.100 కోట్లతో అయోధ్య రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయోధ్య విమానాశ్రయం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.321 కోట్లు విడుదల చేసింది. దీనికి మర్యాదా పురుషోత్తమ్ శ్రీరామ్ విమానాశ్రయంగా నామకరణం చేస్తారు. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం కోసం అదనంగా 555.66 ఎకరాల భూమిని సేకరించేందుకు రూ.1,001.77 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అదనంగా కేంద్ర ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసింది.

# గ్రూప్ 1 రిక్రూట్‌మెంట్‌లో ఇంటర్వ్యూలు రద్దు



విజయవాడ: గ్రూప్ 1 రిక్రూట్ మెంట్ లో ఇంటర్వ్యూ విధానం రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో అన్ని కేటగిరిల్లోనూ ఇంటర్వ్యూలు రద్దు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీపీఎస్సీ ప్రతిపాదన మేరకు ఇంటర్వ్యూ విధానం రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రూప్ పరీక్షల్లో సంపూర్ణ పారదర్శకత కోసం ఇంటర్వ్యూ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

# దేశం లో మరింత తగ్గుముకం పట్టిన కరోనా మహమ్మారి

**గడిచిన 24 గంటల్లో 48,698 కేసులు నమోదు**

న్యూఢిల్లీ జూన్ 26 దేశంలో కరోనా మహమ్మారి తీవ్రత తగ్గుతున్నది. రోజువారీ కేసులతో పాటు మరణాలు సైతం దిగి వస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో 48,698 కేసులు నమోదయ్యాయని కేంద్ర కుటుంబ ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. తాజాగా 64,818 మంది బాధితులు కోలుకొని ఇండ్లకు వెళ్లారు. అలాగే కొత్తగా వైరస్ బారినపడి 1,183 మంది మృత్యువాతపడ్డారు. కొత్తగా నమోదైన కేసులతో 3,01,83,143కు చేరింది.



ఇప్పటి వరకు 2,91,93,085 మంది కోలుకున్నారు. మహమ్మారి బారినపడి 3,94,493 మంది మృత్యువాతపడ్డారు. 86 రోజుల తర్వాత ఆరు లక్షలకు దిగువకు క్రియాశీల కేసులు చేరుకున్నాయని, ప్రస్తుతం దేశంలో 5,95,656 యాక్టివ్ కేసులున్నాయని పేర్కొంది.ప్రస్తుతం జాతీయ రికవరీ రేటు 96.72 శాతానికి పెరిగిందని, వీక్లీ పాజిటివిటీ రేటు 2.97 శాతంగా ఉందని చెప్పింది. వరుసగా 19 రోజులు రోజువారీ పాజిటివిటీ రేటు 2.79 శాతానికి పడిపోయిందని తెలిపింది. మరో వైపు టీకా డ్రైవ్ దేశంలో ముమ్మరంగా సాగుతోంది. గడిచిన 24 గంటల్లో భారత్‌లో 61.19లక్షల టీకా డోసులు వేసినట్లు చెప్పింది. ఇప్పటి వరకు 31.50 మోతాదులు పంపిణీ చేసినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. ఇదిలా ఉండగా.. కరోనా టెస్టులు సైతం భారీగానే సాగుతున్నాయి. ఇప్పటి వరకు 40.18కోట్ల శాంపిల్స్ పరీక్షించినట్లు ఐసీఎంఆర్ వివరించింది.

# ప్రజావిశ్వాసం కోసం న్యాయస్థానాలు పనిచేయాలి: సీజేఐ రమణ

న్యూఢిల్లీ: ప్రజా విశ్వాసం కోసం న్యాయస్థానాలు పని చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పిలుపునిచ్చారు. సామాన్యులకు న్యాయాన్ని అందించడంలో ప్రతి ఒక్కరూ తమ తోడ్పాటు అందించాలని అన్నారు. శనివారం సుప్రీంకోర్టు మాజీ



న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రన్ రాసిన ఎనమిలీస్ ఇన్ లా అండ్ జస్టిస్ పుస్తకాన్ని జస్టిస్ రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ... న్యాయస్థానాలపై సామాన్యులకు నమ్మకం పెరిగేలా.. అనేక విషయాలను జస్టిస్ రవీంద్రన్ తన పుస్తకంలో ప్రస్తావించారని సీజేఐ తెలిపారు. న్యాయశాస్త్రంలో ఉన్న లోపాలు సరి చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ప్రస్తావించారు. తన పుస్తకం ద్వారా న్యాయస్థానాలపై ప్రజల్లో విశ్వాసం నెలకొల్పారని సీజేఐ పేర్కొన్నారు. న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ప్రజా ప్రయోజనాల కోసం పని చేయడం హర్షణీయం అని కితాబిచ్చారు. ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన రోజు జస్టిస్ రవీంద్రన్ రాసిన లేఖను ఈ సందర్భంగా జస్టిస్ రమణ గుర్తు చేసుకున్నారు. ఆ లేఖలో జస్టీస్ రవీంద్రన్ ప్రస్తావించిన ప్రతి అంశాన్ని ప్రామాణికంగా తీసుకున్నట్లు సీజేఐ ఎన్వీ రమణ వెల్లడించారు.

# ప్రభుత్వ నిర్వాకం వల్ల ఏపికి వచ్చిన పరిశ్రమలు వెనక్కు : కొల్లు రవీంద్ర



అమరావతి జూన్ 26 ఏపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల ఆంధ్రప్రదేశ్‌కి వచ్చిన పరిశ్రమలు బై బై జగన్ అంటూ వెళ్లిపోతున్నాయని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర మండిపడ్డారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క కొత్త పరిశ్రమనైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే యువతకి ఉపాధి లభిస్తుందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కష్టపడి పరిశ్రమలు తీసుకువచ్చారని తెలిపారు. చంద్రబాబు తీసుకువచ్చిన పరిశ్రమలను వైసీపీ నేతలు భయపెట్టి రాష్ట్రం నుండి వెళ్లగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల కోట్లు పెట్టుబడి పెట్టి ఏపీలో పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వచ్చిన దాదాపు 10 కంపెనీలు ఏపీ నుంచి వెళ్లిపోయాయన్నారు. పరిశ్రమలు వెళ్లిపోతుంటే ఏపీఐఐసి చైర్మన్, పరిశ్రమల శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. యువతను నిర్వీర్యం చేసి వాలంటిర్ ఉద్యోగాల కోసం ఎదురు చూసేలా చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో పెట్టుబడుల్లో ఏపీ రెండవ స్థానంలో ఉంటే ఇప్పుడు 16వ స్థానానికి పడిపోయిందని చెప్పారు. పరిశ్రమలు వెళ్లిపోతున్నందుకు ముఖ్యమంత్రి సిగ్గు పడాలన్నారు. "పరిశ్రమలు తీసుకురాలేకపోతే మీరు తప్పుకోండి....అంతే కానీ మీ చేతకానితనంతో యువత జీవితాలను నాశనం చేయొద్దు" అంటూ కొల్లు రవీంద్ర హితవు పలికారు.

# అన్నదాతలకే మా మద్దతు : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ చెప్పారు. తాము రైతులతోనే ఉన్నామన్నారు. సత్యాగ్రహం చేస్తున్న అన్నదాతలతోనే తాము ఉన్నామన్నారు. ఈ విషయాన్ని చాలా స్పష్టంగా చెప్తున్నట్లు తెలిపారు. కొత్త సాగు చట్టాలను రద్దు చేయాలని కోరుతూ రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన కార్యక్రమాలు ప్రారంభించి ఏడు నెలలు పూర్తయిన సందర్భంగా రాహుల్ గాంధీ శనివారం ఓ ట్వీట్ ఇచ్చారు. చాలా స్పష్టంగా చెప్తున్నామని, తాము రైతులకు అండగా ఉంటామని తెలిపారు. తాము సత్యాగ్రహం చేస్తున్న రైతులకే మద్దతిస్తామన్నారు. నిరసన కార్యక్రమాలకు ఏడు నెలలు పూర్తయిన సందర్భంగా "వ్యవసాయ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణవ దినంగా రైతు సంఘాలు శనివారం పాటిస్తున్నాయి. నిరసన తెలుపుతున్న రైతు సంఘాలన్నీ సంయుక్త కిసాన్ మోర్చాగా ఏర్పడ్డాయి. కొన్ని రా(ష్ట్రాల్లో రాజ్‌భవన్‌ల వద్ద నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించాయి. రైతు సంఘాలు ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన కార్యక్రమాలను గత ఏడాది నవంబరు 26న ప్రారంభించాయి. కొత్త సాగు చట్టాలను రద్దు చేయాలని, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాయి.

## జగన్ పాలనలో ప్రజల మాన ప్రాణాలకు రక్షణ కరువైంది

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు**

అమరావతి జూన్ 26 జగన్ రెడ్డి పాలనలో ప్రజల మాన ప్రాణాలకు రక్షణ కరువైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు విమర్శించారు. టీడీపీ నేత మునెప్ప ఆస్తులు ఆక్రమించి.. తిరిగి దాడి చేస్తారా అని మండిపడ్డారు. జగన్ రెడ్డి పాలనలో అరాచకానికి, అకృత్యాలకు కేరాఫ్ అడ్రస్ ఏపీ అని అన్నారు. రోజుకో హత్య, గంటకో విధ్వంసం రాష్ట్రంలో నిత్యకృత్యమైపోయాయని తెలిపారు. చిత్తూరు జిల్లా రామసముద్రంలో టీడీపీ నేత మునెప్పపై వైసీపీ దాడి హేయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి కబ్జా చేసి.. అడ్డుకున్నందుకు హతమార్చాలని ప్రయత్నిస్తారా అని ప్రశ్నించారు.

# పేద దేశాలకు వ్యాక్సిన్లు ఇవ్వండి.. వేడుకున్న డబ్ల్యూహెచ్‌వో చీఫ్

జెనీవా: పేద దేశాలకు కరోనా వ్యాక్సిన్లు ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ అథనమ్ గెబ్రియాసిస్ ప్రపంచ దేశాలను కోరారు. వ్యాక్సినేట్ అయిన సంపన్న దేశాలు మళ్లీ తెరుచుకుంటున్నాయని, కోవిడ్‌తో రిస్క్ లేనటువంటి యువతకు కూడా వ్యాక్సిన్లు ఆ దేశాలు ఇస్తున్నాయని ఆయన అన్నారు. కానీ అతి పేద దేశాలకు ఇంకా వ్యాక్సిన్లు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ టీకాల పంపిణీలో ప్రపంచవ్యాప్తంగా విఫలమైనట్లు టెడ్రోస్ తెలిపారు. ఆఫ్రికాలో పరిస్థితి దారుణంగా ఉందని, గత వారంతో పోలిస్తే ప్రస్తుతం ఇన్‌ఫెక్షన్లు, మరణాలు 40 శాతం పెరిగాయని, పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉందని, డెల్ట్ వేరియంట్



వైరస్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్నట్లు టెడ్రోస్ చెప్పారు. వ్యాక్సినేషన్ విషయంలో ఓ ప్రపంచంగా మన విఫలమవుతున్నాయని ఆయన అన్నారు.జెనీవాలో మీడియాతో మాట్లాడిన టెడ్రోస్.. అతి పేద దేశాలకు వ్యాక్సిన్లను సరఫరా చేయడంలో కొన్ని అగ్రదేశాలు విఫలమైనట్లు ఆయన చెప్పారు. అయితే ఏయే దేశాలు నిర్లిప్తంగా ఉన్నాయన్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. గతంలో ఆఫ్రికా దేశాలు ఎయిడ్స్ సంక్షోభ సమయంలో సరైన రీతిలో వ్యవహరించలేదన్న అంశాలను పక్కనపెట్టాలన్నారు. ప్రస్తుతం వ్యాక్సిన్ల సరఫరా సమస్యగా మారిందని, ఆఫ్రికా దేశాలకు వ్యాక్సిన్లు ఇవ్వాలంటూ ఆయన వేడుకున్నారు. ఉన్నవాళ్లు, లేనివాళ్ల మధ్య తేడా పెరుగుతోందని, ఇది అసమానతలను ఎత్తి చూపుతోందన్నారు.వ్యాక్సిన్లు మీరు వాడరన్న ఉద్దేశంతో ఆఫ్రికా దేశాలకు వాటిని సరఫరా చేయకపోవడం అది బ్రిటీష్ పాలన నాటి మైండ్‌సెట్‌ను చూపుతుందని, మహమ్మారి వేళ ఇది సరైన ప్రవర్తన కాదు

# సంపాదకీయం

ఆదివారం 27 జూన్ 2021

## ఆర్థిక నేరగాళ్ల పై కేంద్రం ఉక్కుపాదం

దేశాన్ని మోసం చేసి, బ్యాంకులకు టోపీ వేసి వేల కోట్ల రూపాయలు కాజేసిన వారికి గట్టి గుణపాఠం ఇది . విజయమాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ ల ఉదంతం కేంద్ర ప్రభుత్వంపై నమ్మకం పెంచుతోంది. విదేశాల్లో సుఖసంతోషాలతో హ్యాపీగా కాలం గడిసిపోతుందనుకుంటున్న వారికి చెంపపెట్టులాంటి సంఘటనలు తాజాగా చోటు చేసుకున్నాయి. సాధారణంగా కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్తలు కేసులు నమోదు చేయడమే తప్ప వాటిని కొలిక్కి తెస్తున్న ఉదంతాలు కనిపించవు. రాజకీయ కారణాలు, చట్టపరమైన లొసుగులు, అవినీతి కలగలిసి ఆర్థిక నేరగాళ్లను బయటపడేస్తున్నాయి. అటువంటి స్థితిలో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ మాల్యా, నీరవ్, చోక్సీల నుంచి జప్తు చేసుకున్న ఆస్తుల వేలం ద్వారా ఇప్పటికే 9 వేల కోట్ల రూపాయలు రాబట్టడం ఘనవిజయమే. ఇంతకంటే భారీగా బ్యాంకులను మోసం చేసిన వారు సైతం దేశంలో ఉన్నారు. అయితే విదేశాలకు పారిపోయి, సురక్షితంగా ఉంటామనుకోవడంతోనే వీరి వ్యవహారం పెద్ద చర్చనీయమైంది. ఎక్కడ దాక్కున్నా చట్టానికి స్వేచ్ఛ కలిపిస్తే పట్టుకోవచ్చని వీరి ఉదంతం తేటతెల్లం చేసింది. వారి ముగ్గుర్నీ దేశానికి రప్పించి శిక్షలు అమలు చేసేందుకు పూనుకుంటున్నట్లు భారత ప్రభుత్వం చెబుతోంది. దీనివల్ల మిగిలిన ఆర్థిక నేరగాళ్లకు గట్టి హెచ్చరికలు పంపినట్లు అవుతుంది. ఈ ముగ్గురు ఆర్థిక నేరగాళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన విమర్శలు ఎదుర్కొంది. దేశం విడిచి వెళ్లిపోయే సమయంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని విమర్శలు వచ్చాయి. ప్రతిపక్షాల చేతికి బ్రహ్మాండమైన అస్త్రంగా మారింది. నిజానికి వీరి రుణాలు మోడీ ప్రభుత్వ హయాంలో మొదలు కాలేదు. యూపీఏ కాలం నుంచే బ్యాంకులను మోసం చేస్తూ తిమ్మినిబమ్మిని చేస్తూ వచ్చారు. మోడీ ప్రభుత్వం వచ్చేనాటికే మాల్యా దివాళా తీశారు. నీరవ్, చోక్సీలు కూడా రుణాలు చెల్లించడం సాధ్యం కాదని ఒక అంచనాకు వచ్చారు. ఫలితంగానే దేశం నుంచి ఉడాయించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం గట్టి ప్రయత్నమే చేసిందని చెప్పాలి. 2018లో ప్రత్యేక చట్టమే చేసింది. ఇతర దేశాల్లో ఆశ్రయం పొందుతున్న దేశీయ ఆర్థిక నేరగాళ్ల ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి ఈ చట్టం వీలు కల్పించింది. అదే సమయంలో విదేశాల్లో ఆస్తులను కూడా స్వాధీనం చేసుకునే వెసులుబాటునిచ్చింది. పలితంగానే వీరు మొత్తం 22 వేల కోట్లు బ్యాంకులకు మోసం చేస్తే స్వదేశీ ఆస్తులు 17వేల కోట్లు, విదేశీ ఆస్తులు వెయ్యి కోట్లు జప్తు చేయగలిగారు. ప్రభుత్వ అధీనంలో ఉన్న మిగిలిన ఆస్తుల ద్వారా మరో తొమ్మిది వేల కోట్లు బ్యాంకులకు జమ అయ్యేందుకు అవకాశం ఉంది. మోసం చేసిన మొత్తంలో 80శాతం రాబట్టడమంటే చిన్న విషయం కాదు. ఈ విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని, దర్యాప్తు సంస్థల పనితనాన్ని మెచ్చుకోవాల్సిందే. భారతదేశంలో ఆర్థిక నేరాలు చేసిన వాళ్లకు చట్టం పట్ల భయం తక్కువ. తమకేమీ కాదనే దీమా వారిది. కంపెనీల పేరిట అప్పులు చేసి దివాళా చూపించి తర్వాత దుకాణం మూసేస్తూ ఉంటారు. బ్యాంకులు మునిగిపోతుంటాయి. ఇబ్బడిముబ్బడిగా రుణాలు తీసుకున్న వాళ్లు మాత్రం పక్కదారి పట్టించిన నిధులతో విలాసవంతంగా జీవిస్తూ ఉంటారు. ఈ రకంగా వివిధ వ్యాపారాలు, కాంట్రాక్టులు, పరిశ్రమల పేరిట లక్షల కోట్ల లోనే బ్యాంకులకు టోపీ వేసిన వారున్నారు. దేశంలోనే ఉంటూ చట్టం నుంచి తప్పించుకుంటూ దర్యాప్తు సంస్తలను ముప్పుతిప్పలు పెడుతున్న వీరిపైన కూడా కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. వీరిలో ఎక్కువ మంది రాజకీయ ఆశ్రయం పొందుతున్నారు. ఎంపీలుగా చెలామణి అవుతున్నారు. లేదా అధికారపార్టీల్లో కొనసాగుతున్నారు. అటువంటి వారి వల్లే బ్యాంకులకు ఎక్కువ నష్టం వాటిల్లుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు దర్యాప్తు సాగుతున్న వారిలో చాలామంది ప్రముఖులే ఉండటం విశేషం. మాజీ కేంద్ర మంత్రి సుజనాచౌదరి , కావూరి సాంబశివరావు, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, టీఆర్ఎస్ లోకసభా పక్ష నేత నామా నాగేశ్వరరావు వంటి వారి సంగతి అందరికీ తెలిసిందే. రాజకీయ సంబంధాలున్నవారిపై కూడా నిష్పాక్షికంగా విచారణ జరిగేలా దర్యాప్తు సంస్థలకు స్వేచ్ఛ కల్పించాలి. ఐసీఐసీఐ , హెచ్ డీఎఫ్ సీ వంటి బ్యాంకులు వ్యాపార రంగంలో దూసుకుపోతున్నాయి. కానీ ప్రభుత్వ రంగ బ్యాంకులు దివాళా దిశలో పయనిస్తున్నాయి. ప్రభుత్వపరమైన ఒత్తిళ్లు, బ్యాంకింగ్ వ్యవస్థలోని అవినీతి ఒక కారణంగా చెప్పుకోవాలి. బ్యాంకులను ఆదుకోవడానికి ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోంది. కానీ జవాబుదారీతనం రావడం లేదు. పారిశ్రామిక, కాంట్రాక్టు సంస్థలు ఎగవేసిన నిధుల్లో అదికమొత్తాలు ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందినవే. ప్రభుత్వ పెద్దల పొలిటికల్ ఇన్ ఫ్లూయన్స్ కు లొంగిపోతున్నారు ఉన్నతాధికారులు. చిన్న మొత్తాల్లో ఇచ్చే గ్రుహరుణాలలో మాత్రమే 99శాతం వరకూ రికవరీలున్నాయి. మిగిలిన పెద్ద రుణాల్లో ప్రత్యేకించి పారిశ్రామిక, కార్పొరేట్ రుణాల వసూళ్లు దైవాధీనంగా ఉంటున్నాయి. పారిశ్రామికీకరణ, మేకిన్ ఇండియా వంటి వాటిని ప్రోత్సహించాలనే ప్రబుత్వ లక్ష్యాలను ఆసరాగా చేసుకుంటూ బ్యాంకులు కొందరు పారిశ్రామిక వేత్తలతో కుమ్మక్కు అవుతున్నాయనే ఆరోపణలను ఎదుర్కొంటున్నాయి. దీనిపై కూడా సమగ్రంగా నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. మాల్యా, నీరవ్; చోక్సీల విషయంలో సాధించిన విజయం దేశీయ ఆర్థిక నేరగాళ్లపై ఉక్కుపాదం మోపడానికి ఉత్సాహం నింపాలి.

# దారి మళ్లుతున్న పీడీ ఫండ్స్


విజయవాడ, జూన్ 26, (న్యూస్ పల్స్)రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ సంస్థలు తీసుకున్న రుణాలను పిడి ఖాతాల ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బడ్జెట్ అవసరాలకు వాడుకుంటున్న విధానం... ఆయా సంస్థలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. సంస్థలకు తిరిగి చెల్లించాల్సిన ప్రభుత్వం నిధుల లేమి కారణంగా చేతులెత్తేస్తుండడంతో రుణ దాతల నుంచి సంస్థలపై ఒత్తిడి పెరిగిపోతోంది. తీసుకున్న రుణాన్ని సకాలంలో తీర్చనందున ఆ సంస్థలు డిఫాల్టర్లుగా మారిపోతున్నాయి. పిడి అకౌంట్ల ద్వారా తీసుకున్న మొత్తాలను తమకు తిరిగి ఇవ్వాలంటూ ఇటీవల కాలంలో ప్రభుత్వానికి సంస్థల నుంచి వస్తున్న లేఖలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి.ప్రభుత్వరంగ సంస్థలకు వ్యాపార నిర్వహణ, మౌలికవసతుల కల్పన, ప్రజావసరాల కోసం రుణం తీసుకునేందుకు ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వడం చాలా ఏళ్లగా కొనసాగుతోంది. ఈ గ్యారంటీల మేరకే రుణదాత సంస్థలు వేల కోట్లు అప్పులు ఇస్తున్నాయి. అయితే వచ్చిన రుణాలను వచ్చినట్టే పిడి ఖాతాల్లో జమచేయించి బడ్జెట్ అవసరాల కోసం ఆర్థికశాఖ ద్వారా ప్రభుత్వం పలు కార్యక్రమాలకు, పథకాలకు వాడుకుంటోంది. ప్రధానంగా ఇంధన శాఖ, పౌరసఫరాల శాఖ, నీటిపారుదల శాఖ, ఆర్టీసీ, రోడ్లు భవనాలు, రాష్ట్ర అభివృద్ధి సంస్థ వంటివి భారీగా రుణాలు తీసుకుంటున్నాయి. ఇలాంటి రుణాలు రూ.70 వేల కోట్లపైనే ఉరటాయన్నది ఒక అంచనా. స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే ఈ రకమైన ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్‌ను ప్రోత్సహిస్తోంది.

గత ప్రభుత్వం ఇదే విషయాన్ని బాహాటంగానే ప్రకటించగా, దానిపై తీవ్రపైన ఆరోపణలు చేసిన అప్పటి ప్రతిపక్షం ఇప్పుడు అదికారానికి వచ్చి అదే బాటలో పయనించడం గమనార్హం.ఆఫ్ బడ్జెట్ పేరిట తాను తీసుకున్న నిధులను తిరిగి ఇవ్వకపోవడంతో ఆయా సంస్థలు ఇబ్బందుల పాలవుతున్నాయి. కొన్ని సంస్థలైతే ఏకంగా డిఫాల్టర్లుగా, ఎన్‌పిఎ జాబితాలోకి కూడా చేరుకుంటున్నాయి. తమ సమస్యలను నేరుగా ప్రభుత్వానికి చెప్పలేక, మిన్నకుండలేక ఆ సంస్థల ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. అయినా రుణదాత సంస్థల ఒత్తిడి పెరగడంతో ఇటీవలే పౌరసరఫరాల శాఖ ప్రభుత్వానికి ఇదే అరశంపై లేఖ రాయగా, తాజాగా ఇంధన శాఖ కూడా లేఖరాసింది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి ఎపి జెన్‌కో, ఎపిపిపిడిసిఎల్ తీసుకువచ్చిన రుణాల్లో 1500 కోట్ల రూపాయలను ఇదే తరహాలో ప్రభుత్వ పిడి ఖాతాల్లో జమ చేశారు. వాటిపై కట్టాల్సిన వడ్డీ కూడా చెల్లించలేని పరిస్థితిలో ఇంధన శాఖ ఉండడం గమనార్హం. గతేడాది తీసుకున్న రుణాలపై ఎపి జెన్‌కో దాదాపు రూ.82 కోట్లు, ఎపి పవర్ డెవలప్‌మెరట్ కార్పొరేషన్ రూ.59 కోట్లు వడ్డీ చెల్లించాల్సి ఉంది. ఈ రుణాలపై వడ్డీని చెల్లించేందుకు కూడా కొత్తగా అప్పులు చేయాల్సి వస్తోందని ఆ శాఖ అధికారులు అంటున్నారు. వడ్డీ కూడా చెల్లించకపోవడంతో కేంద్ర పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తీవ్రపైన ఒత్తిడి వస్తున్నట్లు వారు చెబుతున్నారు. అందుకే తక్షణమే వడ్డీ మొత్తమైనా సమకూర్చాలని ఆ శాఖ ప్రభుత్వాన్ని కోరుతోంది.

# మంత్రి వర్గ విస్తరణ సునామీ..

విజయవాడ, జూన్ 26, (న్యూస్ పల్స్)ముఖ్యమంత్రి జగన్ రెక్కల కష్టం వైసీపీకి అధికారం అన్నది తెలిసిందే. అయితే ఎంతో కొంత తమ పాత్ర కూడా ఉందని భావించి కాలరెగరేసే నాయకులు కూడా ఈ ప్రాంతీయ పార్టీలోనూ బోలెడంత మంది ఉన్నారు. జగన్ తో పాటు తమ వ్యక్తిగత చరిష్మా కలిస్తేనే ఏపీలో పవర్ లోకి వచ్చామని వారు కాస్తా గట్టిగానే చెబుతారు. వైసీపీకి 151 ఎమ్మెల్యేలు ఉన్నారు. జగన్ తప్పిస్తే మిగిలిన 150 మందిలోనూ పాతిక మందికి మాత్రమే ఫస్ట్ టెర్మ్ లో అమాత్య కుర్చీ దక్కింది. మరో విడతలో కనీసం పదిహేను మంది దాకా అవకాశాలు దక్కుతాయి. మరి మంత్రి పదవి మీద ఆశపెట్టుకున్న మిగిలిన 110 మంది సంగతేంటి. ఇదే ప్రశ్న ఇపుడు వైసీపీలో వినిపిస్తోంది.జగన్ 2019 ఎన్నికల తరువాత అపుడే బంపర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చారు. పైగా కొత్త మోజు. దాంతో నాడు ఆశావహులకు సామాజిక సమీకరణల రూపేణా కాండు జెల్ల తగిలినా బాగా ఓర్చుకున్నారు, సర్దుకున్నారు. పైగా వారిలో ఆశలు ఇంకిపోకుండా జగన్ కూడా వుందిలే మంచికాలం ముందు ముందునా అంటూ ఊరించారు. కానీ కాలం వేగంగా గిర్రున ఇట్టే తిరిగిపోయింది. దాంతో ఆశావహులు అనుకున్న కాలం వస్తోంది. అది మంచిదో కాదో జగన్ చెబితేనే కదా తమకు తెలిసేది అని ఆశావహులు వైసీపీలో అనుకుంటున్నారు. ఈ రకమైన టెన్షన్ తో రోజులు వారు భారంగానే గడుపుతున్నారని చెప్పాలి.ఇక జగన్ మంత్రి వర్గ విస్తరణ చేపట్టడం అనివార్యం. జగన్ మాట తప్పరు కాబట్టి రెండున్నరేళ్ల తరువాత తొంబై శాతం మందిని మార్చి వారి ప్లేస్ లో కొత్తవారిని తీసుకోవాలి. మరి ఇందులో సామాజిక సమీకరణలు మరోటీ అని కబుర్లు చెప్పి చాలా మందికి ఝలక్ ఇస్తే తట్టుకోవడానికి ఈసారి ఎవరూ సిద్ధంగా లేరుట. ముఖ్యంగా పెద్ద తలకాయలు కొన్ని పార్టీలో ఉన్నాయి. వారు వారు జగన్ విస్తరణకు పెట్టే ముహూర్తమే తమ రాజకీయ భవిష్యత్తుకు కూడా ముహూర్తమని ఆఫ్ ది రికార్డుగా చెప్పేస్తున్నారు. జగన్ తమను పట్టించుకోకపోతే మాత్రం తాము చేయాల్సింది చేస్తామని కూడా అంటున్న వారు ఉన్నారు.ఏ నాయకుడికి అయినా జనంలో గెలవడం ఎంత సవాలో సొంత జనాలను గెలవడం అంతకు మించిన సవాల్. పదవులూ మీదనే వర్తమాన రాజకీయాలో అందరూ ఆశపెట్టుకుంటారు. అర్హతలు అన్నవి పూర్తిగా సెకండరీ. పైగా వేచి ఉండడానికి ఇవి పాతకాలం రోజులు కానే కావు. ఇలా ఎమ్మెల్యే అయ్యామా అలా మంత్రి కుర్చీ పట్టామా అన్నదే నాయకులకు కావాలి. మరి జగన్ అందరి కోరికలూ తీర్చగలరా. సరిగ్గా ఇక్కడే ఈ బంపర్ మెజారిటీ జగన్ కి కడు భారంగా ఉందిట. పైగా భయపెడుతోందిట. దాంతో జగన్ ఆచీ తూచీ పదవులు పంచాలి. అదే సమయంలో అసంతృప్తివాదులను దారికి తెచ్చుకొవాలి. లేకపోతే మాత్రం 2022 న్యూ ఇయరే జగన్ కి వెరీ బ్యాడ్ గా స్టార్ట్ అవుతుంది అన్నది వైసీపీలో వినిపిస్తున్న మాట. ఈ సమయం కోసమే టీడీపీ కూడా ఎదురుచూస్తోందిట. జగన్ మంత్రి వర్గ విస్తరణ చిచ్చు రేపితే ఆ మంటలలో చలి కాచుకోవడానికి టీడీపీ రెడీగా ఉంటుందని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. ఇక్కడ ట్విస్ట్ ఏంటి అంటే వైసీపీలో కనబడని అసమ్మతి ఉందిట. పదవులు దక్కని వారు బాబు తో టచ్ లో ఉంటారు అనడంతో సందేహమే లేదుగా

# అర్థం కానీ బాబు వ్యూహం..



గుంటూరు, జూన్ 26, (న్యూస్ పల్స్)రాజకీయ పరిణామాలు, పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. నిన్నటి నేతలు.. నేడు దమ్మిలుకావొచ్చు. పార్టీలు ఏవైనా.. పరిణామాలు అనూహ్యంగా మారిపోనూ వచ్చు. ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షం టీడీపీ అధినేత చంద్రబాబు వైఖరిపైనా ఇలాంటి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫ్యూచర్ గురించి చెప్పుకొనే ముందు.. గతంలో చంద్రబాబు ఏం చేశారో.. చూద్దాం. 2014 ఎన్నికల్లో బీజేపీతో జట్టుకట్టి.. ఎన్నికలకు వెళ్లారు. అధికారంలోకి రాగానే.. టీడీపీ సర్కారులో బీజేపీకి మంత్రి పదవులు ఇచ్చారు. అదేవిధంగా.. కేంద్ర సర్కారులోనూ చేరి మంత్రి పదవులు దక్కించుకున్నారుకట్ చేస్తే.. మూడేళ్ల తర్వాత.. ఈ బంధం విడిపోయింది. రుసరుసలు.. మాట విసుర్లు.. నువ్వొకటంటే.. నే రెండంటా! అనే తీరులో యుద్ధం సాగింది ఇరు పార్టీల మధ్య. ఇక, తాను ప్రవేశ పెట్టిన సంక్షేమ పసుపు కుంకాలతో అధికారంలోకి వచ్చేస్తానంటూ.. ఒంటరి పోరాటం చేసిన చంద్రబాబుకు .. గత 2019 ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైంది. దీంతో ఆయన వచ్చే ఎన్నికల నాటికి.. బీజేపీ సహా కాంగ్రెస్ మినహా కలిసి వచ్చే అన్ని పార్టీలతోనూ పొత్తు పెట్టుకునిముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.అయితే.. బీజేపీ పెద్దలు మాత్రం చంద్రబాబును పక్కన పెడతామని అంటున్నారు. కానీ, వచ్చే ఏడాది ఈ ఇద్దరికీ అగ్ని పరీక్షగా మారనుంది. వచ్చే ఏడాది జూలైలో రాష్ట్రపతి ఎన్నికలు ఉన్నాయి. గత రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి, ప్రస్తుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు చంద్రబాబు మద్దతు పలికారు. ఇక, వచ్చే రాష్ట్రపతి ఎన్నికల్లో నూ బీజేపీకి చంద్రబాబు అవసరం.. బాబుకు ఏపీ ఎన్నికల్లో బీజేపీ అవసరం ఉన్నాయి. చంద్రబాబుకు 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు (కండువా మార్చిన వారితో కూడా. వారు అధికారికంగా టీడీపీనే). అలానే ముగ్గురు ఎంపీలుఉన్నారు.సో.. చంద్రబాబు అవసరం బీజేపీకి ఎంతో ఉంది. ఎందుకంటే.. ఉత్తరాదిన బీజేపీ బలహీనపడుతున్న నేపథ్యంలో ఏపీ వంటి కీలకమైన తటస్థ ప్రతిపక్షాలు ఉన్న రాష్ట్రాలపై బీజేపీ పెద్ద ఎత్తున నమ్మకం పెట్టుకుంది. ఈ క్రమంలో మరి బీజేపీ నాలుగు మెట్లు దిగుతుందా? లేక.. చంద్రబాబే దిగి వచ్చి బీజేపికి మద్దతు ప్రకటిస్తారా? ఇవన్నీ కాకుండా.. ఇరు పార్టీలూ బెట్టుతో మూతి ముడుచుకుంటాయా? అనేది ఆసక్తిగా మారింది.

# ఏపీలో రెండు పార్టీలకు చుక్కలు..

విజయవాడ, జూన్ 26, (న్యూస్ పల్స్)ఏపీలో బీజేపీ నోటాతోనే పోటీ పడుతుంది. కానీ ఢిల్లీలో మాత్రం ఆ పార్టీ వెంట అధికార వైసీపీ, విపక్ష టీడీపీ పడతాయని ప్రచారంలో ఉంది. మోడీని పల్లెత్తు మాట అనకుండా నెట్టుకుంటూ రావడంలోనే ఈ రెండు పార్టీల అధినేతల చాకచక్యం చాలా ఉంది. ఇవన్నీ ఇలా ఉంటే తాము ఎంతలా మద్దతు ఇస్తున్నా బీజేపీ అనుసరిస్తున్న కొన్ని విధానాలు మాత్రం అటు వైసీపీకి, ఇటు టీడీపీకి తెగ చికాకు తెప్పిస్తున్నాయి. ఆ చికాకు నుంచి అంతులేని ఫ్రస్ట్రేషన్ కూడా పుట్టుకొస్తోంది. అందుకే అటూ ఇటూ ఇద్దరు సీనియర్లు ఇండైరెక్ట్ గా బీజేపీ మీద ఒక్క లెక్కన మండిపోతున్నారు.ముందుగా అధికార వైసీపీ ఫ్రస్ట్రేషన్ గురించి చెప్పుకుంటే తన పార్టీ ద్వారా గెలిచి నిత్యం కాలిలో ముల్లు మాదిరిగా నరకం చూపిస్తున్న రఘురమ క్రిష్ణం రాజు మీద వేటు వేయమని ఏడాదిగా కోరుతున్నా పట్టించుకోకపోవడం పట్ల గుస్సా అవుతోంది. ఈ ఏడాదిలో ఎన్నో మార్లు లేఖలు రాశామని, నేరుగా వచ్చి కలిశామని, అయినా ఎందుకు చర్యలు తీసుకోరు అంటూ స్పీకర్ ఓం బిర్లాకు వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు రఘురామక్రిష్ణం రాజు లేఖాస్త్రం సంధించారు. ఇది సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులకు, ఫిరాయింపుల చట్టానికి కూడా విరుద్ధమని ఆయన అంటున్నారు. ఈ లేఖ స్పీకర్ కి రాసినా కూడా కేంద్ర పెద్దల వైఖరిని ఇండైరెక్ట్ గా విజయసాయిరెడ్డి ప్రశ్నించేశారు. ఇది మంచి విధానం కాదు అంటూ ఆయన పేర్కొన్న విషయాలు వైసీపీ అసహనానికి అద్దం పడుతున్నాయి.ఇక టీడీపీలో సీనియార్ మోస్ట్ నాయకుడిగా ఉన్న యనమల రామకృష్ణుడు కూడా జగన్ సీబీఐ కేసుల గురించి ప్రస్తావిస్తూ అవి ఎందుకు తొందరగా విచారణకు నోచుకోవడం లేదని ప్రశ్నించారు. జగన్ని విజయమాల్యా, లలిత్ మోడీ వంటి ఆర్థిక నేరగాళ్ల పక్కన పెట్టి మరీ యనమల ద్వారా టీడీపీ తన అసహనాన్ని చాటుకుంది. కొన్ని కేసులలో వేగం చూపిస్తున్న దర్యాప్తు సంస్థలు జగన్ కేసుల విషయంలో తాత్సారంతో వ్యవహరిస్తున్నాయని కూడా యనమల ఆక్షేపించడం వెనక కేంద్రాన్ని విమర్శించడమే ఉంది. కేంద్రం దన్నుగా ఉంటోందన్న అర్థం వచ్చేలాగానే యనమల ఈ భారీ డైలాగులు వాడారు.ఈ రెండు అసహనాల వెనక కేంద్ర పెద్దలు, బీజేపీ ఉన్నారనే అర్థం. ఇక జగన్ కేంద్రానికి పూర్తి మద్దతుగా నిలుస్తున్నారు కాబట్టి ఆయన మీద ఉన్న సీబీఐ కేసుల వ్యవహారం నత్తనడకగా ఉందని అంతా అంటున్న సంగతి విషయమే. ఇక రఘురామక్రిష్ణం రాజు వ్యవహారం తీసుకుంటే ఆయనకు కూడా బీజేపీ పెద్దల సపోర్ట్ ఉందని ప్రచారం లో ఉంది. లేకపోతే ఏడాది గడుస్తున్నా కూడా స్పీకర్ కనీసం అనర్హత పిటిషన్ మీద ఆయన్ని పిలిచి విచారించకపోవడం విడ్డూరమే కదా. పైగా రాజు ఢిల్లీలో ఏ కేంద్ర మంత్రిని కలవాలనుకుంటే ఆయన అపాయింట్మెంట్ ఈజీగా దక్కుతోంది. మొత్తానికి బీజేపీ వాడకం మామూలుగా లేదు.

## భారీగా తగ్గుతున్న విదేశీ పెట్టుబడులు

విజయవాడ, జూన్ 26 (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్‌కు గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రూ. 638కోట్ల రూపాయలు. గత ఆర్థిక సంవత్సరం అంటే.. 2020 ఏప్రిల్ నుంచి 21 మార్చి వరకూ అన్నమాట. ఈ మధ్య కాలంలో ఇండియాకు వచ్చిన ఎఫ్‌డీఐలు? రూ. ఆరు లక్షల 14వేల కోట్లు. ఈ పెట్టుబడులన్నీ అన్నీ రాష్ట్రాలకు కలిపి వచ్చినవి. సగటు చేసుకున్న కనీసం రూ. ఇరవై వేల కోట్ల పెట్టుబడులన్నా రావాల్సి ఉంది. కానీ వచ్చింది.. కేవలం ఆరు వందల కోట్లకు కొద్దిగా ఎక్కువ. మొత్తంగా ఇండియాకు వచ్చిన పరిశ్రమల్లో ? 0.10 శాతం మాత్రమే. అదీకూడా.. గత ప్రభుత్వ హయాంలో ఏపీలో పెట్టిన పరిశ్రమల్లో విస్తరణ కోసం.. అదనపు పెట్టుబడిగా పెట్టడానికి తీసుకు వచ్చినవి. కొత్త పరిశ్రమల కోసం కాదు. అంతకు ముందు ఏడాది కన్నా.. గత ఏడాది ఏపీ పరిస్థితి మరింత దిజారింది. ఏపీకి 2019 అక్టోబరు నుంచి 2020 మార్చి వరకు రూ.1,4756 కోట్లు వచ్చాయి. కానీ గత ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తంలో సగం కూడా రాలేదు. పొరుగున ఉన్న తెలంగాణ పరిస్థితి మెరుగ్గా ఉంది. ఆ రాష్ట్రానికి తెలంగాణకు రూ.8,617 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది ఒకటిన్నర శాతం. ఈ లెక్కలన్నీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ విడుదల చేసిన గణాంకాల ద్వారా వెల్లడైంది. సహజంగానే అత్యధిక పెట్టుబడులు గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాలకు వెళ్లాయి. గుజరాత్‌కు సింహ భాగం పెట్టుబడులు వెళ్లాయి. కేంద్రం ప్రత్యేకంగా ప్రమోట్ చేయడం ఓ కారణం అయితే.. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలను ప్రమోట్ చేయడానికి కేంద్రం పెద్దగా సిద్ధంగా లేకపోవడం మరో కారణం అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏపీ ప్రభుత్వం.. .. తమ రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తున్నాయని లెక్కలు ప్రకటించుకుంటోంది కానీ.. వాస్తవంగా వస్తున్నవి ఏమీ లేదని .. తరచూ ఇలాంటి వాస్తవాలతో వెలుగులోకి వస్తూ ఉంటుంది.

# ఆనం... కఠిన నిర్ణయం



నెల్లూరు, జూన్ 26, (న్యూస్ పల్స్)ఆనం రామనారాయణ రెడ్డి రాజకీయ నిర్ణయం మరో ఆరు నెలల్లో తేలిపోతుంది. ఆయనకు త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కకపోతే కీలక నిర్ణయం ఉంటుందని ఆనం అనుచరులు చెబుతున్నారు. అందుకే గత కొద్ది రోజులుగా ఆనం రామనారాయణరెడ్డి హడావిడి పెద్దగా కన్పించడం లేదు. ప్రభుత్వానికి అనుకూలంగా కూడా ఆయన మాట్లాడటం లేదు. విపక్షాలకు వ్యతిరేకంగా కూడా ఆనం స్పందించడం లేదు.ఆనం రామనారాయణరెడ్డి సీనియర్ నేత. నెల్లూరు జిల్లాల్లో పట్టున్న నేత. కాంగ్రెస్ హయాంలో ఆయన పదేళ్ల పాటు మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఆనం రామనారాయణరెడ్డి టీడీపీలోకి వెళ్లిపోయారు. అక్కడ విజయం దక్కకపోవడం, కనీసం ఎమ్మెల్సీగా కూడా ఇవ్వకపోవడంతో 2019 ఎన్నికలకు ముందు ఆనం రామనారాయణరెడ్డి వైసీపీ లో చేరారు. ఆయనకు పట్టున్న ఆత్మకూరు కాకుండా జగన్ ఆనంకు వెంకటగిరి నియోజకవర్గాన్ని కేటాయించారు.అయితే తొలివిడతలోనే తనకు మంత్రిపదవి వస్తుందని ఆనం రామనారాయణరెడ్డి భావించారు. కానీ ఆశ నెరవేరలేదు. అప్పుడప్పుడు కొంత అసంతృప్తులు వెళ్లగక్కారు. ప్రభుత్వంపైన కాకపోయినా జిల్లా నేతలు, మంత్రులు, అధికారులపై ఆయన వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. ఒక దశలో ఆనం రామనారాయణరెడ్డికి షోకాజ్ నోటీసు కూడా ఇవ్వాలని అధిష్టానం భావించింది. కానీ ఆనం నేరుగా జగన్ ను కలవడంతో షోకాజ్ నోటీసు జారీ చేయలేదు.ఇక ఇప్పుడు తనకు మంత్రి పదవి కావాలని ఆనం రామనారాయణరెడ్డి గట్టిగా పట్టుబడుతున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో పట్టున్న తమ ఫ్యామిలీని రాజకీయంగా దెబ్బతీసే కుట్ర జరుగుతుందని ఆయన అనుమానిస్తున్నారు. ఈసారి మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కకుంటే ఆనం రామనారాయణరెడ్డి అసంతృప్తి మరింత పెరిగే అవకాశముంది. ఎన్నికలకు ముందు కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. జగన్ కు 2024 ఎన్నికలకు ముందు ఝలక్ ఇచ్చే తొలి నేతగా ఆనం రామనారాయణరెడ్డి ఉంటారన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి

# మళ్లీ టీడీపీ పాత పాటే

విజయవాడ, జూన్ 26,(న్యూస్ పల్స్)ధ్రప్రదేశ్ లో జగన్ బలంగా తయారయ్యాడు. వచ్చే ఎన్నికల్లో జగన్ ను ఢీకొట్టడం అంత ఈజీ కాదు. జగన్ ఇప్పుడు ఓటు బ్యాంకు పరంగా, ఆర్థికంగా శక్తిమంతుడుగా ఉండటంతో తెలుగుదేశం పార్టీకి ఊపిరి సలపనివ్వడం లేదు. జగన్ ను ఎన్ని రకాలుగా బద్నాం చేయాలని ప్రయత్నిస్తున్నా ఫలితాలు ఇవ్వడం లేదు. అయినా తెలుగుదేశం పార్టీ మాత్రం తన వైఖరిని ఏమాత్రం మార్చుకోలేదు.జగన్అవినీతిపరుడన్నప్రచారాన్నిమళ్లీ ప్రారంభించింది. యనమల రామకృష్ణుడు ఇటీవల ఒక డిమాండ్ చేశారు. జప్తు చేసిన జగన్ ఆస్తులను ప్రభుత్వ ఖజానాలో జమచేయాలంటూ యనమల చేసిన వ్యాఖ్యలు తెలుగుదేశం పార్టీ బేలతనానికి నిదర్శనం. ఇంకా జగన్ ను ప్రజల్లో అవినీతి పరుడిగా నిలబెట్టాలనే తెలుగుదేశం ప్రయత్నిస్తుంది. జగన్ 43 వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని, దానిని ప్రభుత్వ ట్రెజెరీలో జమ చేయాలని యనమల రామకృష్ణుడు ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులను కోరారు.నీరవ్ మోదీ, మొహల్ చోక్సీ, విజయ్ మాల్యాల ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లుగానే జగన్ ఆస్తులను కూడా ప్రభుత్వపరం చేయాలని, వాటిని ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించాలని యనమల రామకృష్ణుడు కోరారు. అంటే మరోసారి జగన్ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న ప్రయత్నమే యనమల రామకృష్ణుడు మాటల్లో కన్పించింది. గత ఏడేళ్లుగా తెలుగుదేశం పార్టీ చేస్తున్న ప్రచారం ఇదేతెలుగుదేశం పార్టీ తొలుత జగన్ లక్ష కోట్ల అవినీతిపరుడని ప్రచారం చేసింది. 2014 ఎన్నికల్లో జగన్ అధికారంలోకి రాకపోయినా ఎక్కువ శాతం మంది ప్రజలు అండగానే నిలిచారు. 2019 ఎన్నికల్లోనూ చంద్రబాబు అదే ప్రచారం చేశారు. 151 సీట్లతో జగన్ అధికారంలోకి వచ్చారు. రెండు ఎన్నికల్లో జగన్ అవినీతి అనే ప్రచారాన్ని ప్రజలు నమ్మకపోయినా తెలుగుదేశం పార్టీ మాత్రం దానిమీదే ఆధారపడుతున్నట్లుంది.

# గిరిజన గురువులుగా 5 నెలలుగా నో జీతాలు

విశాఖపట్టణం, జూన్ 26, (న్యూస్ పల్స్) గిరిజన గురుకులం పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు వేతనాలందక నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్రంలో దాదాపు వీరు రెండు వేల మంది ఉన్నారు. 2020?21 విద్యా సంవత్సరంలో జూన్ నుంచి నవంబరు వరకు ఐదు నెలలు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కరోనా కష్టకాలంలో వేతనాలుంటేనే బతకడమే కష్టతరంగా మారిన ఈ సమయంలో వేతనాలు లేక గిరిజన గురుకులం ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కరోనా కాలంలో ఏ పనీ దొరక్క, ఉపాధ్యాయులు కుటుంబాలను పోషించలేక అప్పులపాలవుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి కాలం గడుపుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. గిరిజన సంక్షేమశాఖ మంత్రి, ఇతర ఉన్నతాధికారులకు తమ సమస్యలను ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఇప్పటివరకు వేతనాలు అందలేదు. వీరికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గతేడాది డిసెంబరులో జరిగిన కేబినెట్ సమావేశం తీర్మానం చేసింది. అంతేగాక సిఎం జగన్ కూడా అధికారులను ఆదేశించారు. ఆదేశాలచ్చి ఆరు నెలలు గడిచినా వేతనాలు మాత్రం అందలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే వారిని ఉద్యోగాల్లో కొనసాగించే ప్రక్రియపై అధికారులెవరూ నోరుమెదపడం లేదు. వేతనాలడిగితే ఉద్యోగాల్లోంచి తీసేస్తామని అధికారుల నుంచి వచ్చే బెదిరింపుల వల్ల వారిలో భయం అత్యధికంగా ఉంది. దీంతో గిరిజన గురుకులం ఉపాధ్యాయుల పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైంది. జూన్ 12న ఉపాధ్యాయుల సర్వీసును రెన్యువల్ చేయాల్సి ఉండగా, గిరిజన సంక్షేమశాఖ అధికారులు మాత్రం పెండింగ్ వేతనాలను అడ్డుపెట్టుకుని రెన్యువల్ ఆర్డర్లను ఉద్దేశపూర్వకంగా నిలుపుదల చేస్తున్నారని గిరిజన గురుకులం గురువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇతర గురుకులాల్లో ఉపాధ్యాయులు, ఇతర కేడర్ల ఉద్యోగులకు సర్వీసు రెన్యువల్ అయిపోయాయి. కేవలం గిరిజన గురకులంలోని ఉపాధ్యాయులను మాత్రమే రెన్యువల్ చేయకుండా ప్రభుత్వం నిలుపుదల చేయడంపట్ల ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాదీ తాము రెన్యువల్ కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని, అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తోందని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గిరిజన గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. ఇతర గురుకులాల్లో జూన్ 12 నుంచి ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ గిరిజన గురుకులం విద్యార్థులు మాత్రం ఆన్‌లైన్ విద్యకు నోచుకోలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తు, ఉపాధ్యాయుల ఉద్యోగాలను కాపాడాలని గిరిజన గురుకులం ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గిరిజన గురకులం ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల రెన్యువల్ ఆర్డర్ల ఫైల్‌ను ఇప్పటికే సిద్ధం చేసి ఉంచాం. కరోనా పరిస్థితుల వల్ల సిబ్బంది కార్యాలయాలకు సరిగ్గా రాకపోవడం వల్ల ఫైల్ ఆలస్యమైంది. జులై వచ్చేలోపు రెన్యువల్ ఆర్డర్లు ఇచ్చేస్తాం. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వేతనాల పెండింగ్ ఫైల్‌ను ఆర్థికశాఖకు పంపించాం. కొన్ని కారణాల వల్ల అది ఇంకా పెండింగ్‌లో ఉంది. త్వరలోనే ఆ ఫైల్‌ను కూడా క్లియర్ చేసి ఉపాధ్యాయులకు వేతనాలందేలా చర్యలు తీసుకుంటాం. ఉపాధ్యాయులు రెన్యువల్, వేతనాలు పెండింగ్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

## బ్యాంకు ఉద్యోగి చేతివాటం

ఏలూరు పశ్చిమ గోదావరిలో బ్యాంకు ఉద్యోగి చేతివాటం చూపించాడు. ఉద్యోగి ఏకంగా బ్యాంకు సొమ్మును స్వాహా చేశాడు.. రైతుల క్రాప్ లోన్ల యొక్క చెక్కుల ట్రాన్స్ ఫర్ కు సంబంధించి రూ.30 లక్ష లను తన వారి ఖాతాలకు మళ్లించి వాడుకున్నాడు. ఆన్లైన్ బెట్టింగులకు అలవాటు పడిన బ్యాంకు . పశ్చిమ గోదా. వరి జిల్లా ఆచంట యూనియన్ బ్యాంకు (ఆంధ్రాబ్యాంకు)లో జరి గిన ఘటనపై రైతులు, బ్యాంకు ఉన్నతాధికారులు తెలిపారు. బ్యాంకు అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ గా పనిచేస్తున్న నాగరాజు ఈ నగదును వేరే ఖాతాలకు మళ్లించి తన సొంత ప్రయోజనాల కోసం వాడుకున్నాడు. మాకు లోన్లు ఎప్పుడు ఇస్తారు?' అంటూ రైతులు అడగడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రైతుల ఖాతాలను మేనేజర్ పరిశీలించగా, సంబంధిత ఉద్యోగి మూడు ఇతర అకౌంట్లలో జమ చేసి వాడుకున్నట్లు తేలడంతో ఉన్నతాధికారులకు తెలి యజేశారు. సుమారు 50 మంది రైతులు క్రాప్లోన్ల చెక్కుల ట్రాన్స్ఫర్ విషయంలో రూ.30 లక్షలకుపైగా నగదు బ్యాంకులో జమ చేశారు. రైతులు రుణాల కోసం బ్యాంకు మేనేజర్ను కలిశారు. డబ్బులు కట్టేశాం. దీంతో వారు బ్రాంచ్లో విచారణ జరిపారు. నాగరా జును ప్రశ్నించడంతో డబ్బులు మళ్లించినట్లు అంగీకరించాడు. దీంతో అధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నాగరాజుపై పోలీసు కేసు పెడతామని చెప్పారు. ఆన్లైన్ బెట్టింగ్లలకు అలవాటు పడిన కారణంగానే నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఆయనపై చర్యలు తీసుకుంటామని, డబ్బు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బ్యాంకు మేనేజరు శివకృష్ణ తెలిపారు.

## జగన్ పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన మరో మంత్రి

హైదరాబాద్, జూన్ 26, (న్యూస్ పల్స్)ఏపీ, తెలంగాణ మధ్య నీటి యుద్ధాలు ముదురుతున్నాయి. కృష్ణ నదిపై ప్రాజెక్టు ల నిర్మాణం విషయంలో అంధ్ర , తెలంగాణ రాష్ట్రాల మధ్య వివాదం ముదురుతోంది ? కృష్ణ నదిపై ఆంధ్రా అక్రమంగా అనుమతులు లేకుండా ప్రాజక్టు లు నిర్మిస్తుందని తెలంగాణ ఆరోపిస్తుండగా , మీరే అక్రమ ప్రాజక్టు లు నిర్మించారని ఆంధ్రప్రదేశ్ ప్రత్యారోపణ చేస్తుంది. దీంతో రాష్ట్రంలోఇప్పుడు జగన్ పై హాట్ కామెంట్స్ చేస్తున్నారు. మంత్రి వేముల వైఎస్ఆర్, జగన్ పై కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.మరో మంత్రి కూడా జగన్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి దొంగ అయితే.. వైఎస్ జగన్ గజదొంగ అని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రం స్పందించి ఇరు రాష్ట్రాల మధ్య నీటి వివాదం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పువ్వాడ మాట్లాడారు. ఏపీ నిర్మిస్తున్న పోతిరెడ్డి ప్రాజెక్టు అక్రమమేనని ఆరోపించారు.కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క నిజాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు మంత్రి పువ్వాడ. కృష్ణా నీటిలో ఎట్టి పరిస్థితుల్లోనూ వాటాను వదులుకోబోమని స్పష్టం చేశారు. ఏపీ నిర్మిస్తున్న ప్రాజెక్టులపై గతంలోనే కేంద్రానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని తెలిపారు

## విజయసాయిరెడ్డి వెర్సస్ అశోకగజపతి రాజు

విజయనగరం, జూన్ 26, (న్యూస్ పల్స్)టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుని టార్గెట్ చేసిన వైసీపీ ఎంపీవిజయసాయి రెడ్డి మరోమారు ఆయనపై విరుచుకుపడ్డారు. ఆయన్ని వదిలేది లేదన్నట్లు ఎంపీ ఘాటు విమర్శలతో రెచ్చిపోయారు. స్త్రీలకు ఆస్తి హక్కు తమ పూసపాటి రాజ్యాంగంలో లేదని చెబితే చట్టం ఒప్పుకోదని విజయసాయి అన్నారు. ఏ బైలా అయినా.. ఫ్యామిలీ లా అయినా చట్టాలనికి లోబడి ఉండాలిన భారత రాజ్యాంగం నిర్దేశించిందని ఆయన గుర్తు చేశారు.రెండింటికీ మధ్య వివాదం వస్తే చట్టం, రాజ్యాంగమే చెల్లుబాటవుతుందని విజయసాయి అన్నారు. పురాతన దురాచారాలైన సతీసహగమనం, వరకట్నం, బహు భార్యత్వం కుటుంబ ఆచారమంటే చట్టం ఒప్పుకోదన్నారు. స్త్రీలకు ఆస్తి హక్కు ఇవ్వడం.. మా సంస్కృతిలోనూ, పూసపాటి రాజ్యాంగంలోనూ లేదంటే చెల్లుతుందా అశోక్? అని ఎంపీ సూటిగా ప్రశ్నించారు.ఎన్టీఆర్ వెన్నుపోటు వ్యవహారంలోనూ అశోక్ గజపతి పాత్ర ఉందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు విజయసాయి. ఎన్టీఆర్‌ను చంద్రబాబు వెన్నుపోటు పొడిస్తే.. అశోక్ గజపతి కత్తి అందించి ఖతం చేశాడని విమర్శించారు. అందుకే ఎన్టీఆర్ పార్టీ నుంచి గెంటేసిన వారిలో మొదటిపేరు బాబుదైతే, రెండోది అశోక్‌దేనని ఆయన చెప్పారు.



## కుంటిసాకులతో 'చేయూత' లబ్ధిదారుల తగ్గింపు

- మహిళల రక్షణలో ప్రభ్వుం ఘోర వైఫల్యం ..
- పథకాలు... చట్టాలు కాగితాలకే పరిమితం
- ఆచరణలో శూన్యం
- మీడియా సమావేశంలో ప్రభుత్వంపై ధ్వజమెత్తిన మాలే విజయలక్ష్మి

రాజమహేంద్రవరంజూన్ 26, (న్యూస్ పల్స్) కుంటి సాకులతో ప్రభుత్వం చేయూత లబ్ధిదారులను తగ్గించిందని తెలుగుదేశం పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ మహిళా విభాగం అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి ధ్వజమెత్తారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మాలే విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళల రక్షణలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో 416 మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగాయని ఆరోపించారు. మహిళా హోమ్ మంత్రి బాధ్యతల్లో ఉన్నా.. ఆమె ఎప్పుడు స్పందించిన దాఖలాలు కనిపించడం లేదన్నారు. సీఎం ఇంటికి కూతవేటు దూరంలో మహిళపై అత్యాచారం జరిగితే ఇంతవరకు నిందితులను అరెస్టు చేయలేకపోయారని ఎద్దేవా చేసారు. దిశ చట్టం వైఎస్ఆర్ సిపికి చుట్టంగా మారిందన్నారు. దిశ చట్టం కింద ఎంత మందిపై కేసులు పెట్టి శిక్షలు విధించారో చెప్పాలని డిమాండ్ చేసారు. కుంటి సాకులు చెబుతూ పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను ప్రభుత్వం తగ్గించుకుంటూ పోతోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఒక పథకంలో లబ్ధి పొందుతున్న వారికి ఈ చేయూత పథకానికి అనర్హులుగా గుర్తిస్తామని ఎందుకు చెప్పలేదని ఇప్పుడెందుకు ఈ కొత్త షరతు పెట్టారని ఇది మహిళలను మోసం చేయడమే కదా అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పసుపు - కుంకుమ పథకం ద్వారా 93 లక్షల మంది మహిళలకు అందించామని అదే లెక్కన 93 లక్షల మందికి ఇవ్వాలి కాని వారిలో 70 లక్షల మందిని అనర్హులుగా గుర్తించి కేవలం 23 లక్షల మందికి మాత్రమే చేయూత పథకం ద్వారా లబ్ధి చేకూర్చి 70 లక్షల మందిని జగన్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఏ ఒక్క మహిళను అర్హురాలిగా చేయకూడదన్న ఉద్దేశంతోనే వింత నిబంధనలు పెట్టారని, గతంలో కాపు మహిళల కోసం కాపు నేస్తం అని పథకం పెట్టి 45 ఏళ్ల నుంచి 60 సంవత్సరాలలోపు వారికి ఏడాదికి వారికి 15 వేల రూపాయలు, అలాగే బీసీ, ఎస్సీ, మైనారిటీ మహిళలకు ఏడాదికి 18 వేల 500 వేశారన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారిలో 30 శాతం మందిని మాత్రమే అర్హులుగా గుర్తించి వారి బ్యాంకు ఖాతాల్లో సదరు సొమ్ము జమ చేశారని, ప్రస్తుతం కొత్త నిబంధనలు పెట్టి ఆ 30 శాతం మందిని కూడా అనర్హులుగా చేయాలని ప్రభుత్వం ఆలోచనలు చేయడం సిగ్గు చేటన్నారు. గతంలో కేవలం 45 నుంచి 60 సంవత్సరాలు వయస్సు మాత్రమే అర్హత ఉండగా, గతంలో ఇచ్చిన ఆ 30 శాతం మంది అర్హులు కూడా 6 నెలల కరెంటు బిల్లు అందచేయాలని, ఆ 6 నెలల కరెంటు బిల్లు కూడా 300 యూనిట్లులోపు ఉండాలని నిబంధన పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇటువంటి విధానాలు మానుకోకపోతే త్వరలో జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో మహిళలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పార్లమెంట్ మహిళా కమిటీ అధికార ప్రతినిధి కప్పల వెలుగు కుమారి మాట్లాడుతూ పది, ఇంటర్ పరీక్షలు రద్దు చెయ్యాలంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. రెండు నెలల పోరాటంలో మూర్ఖపు ప్రభుత్వం మెడలు వంచి పది, ఇంటర్ విద్యార్థుల తరపున పోరాటం సాగించి విద్యార్థులు... వారి తల్లిదండ్రులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. సమావేశంలో పార్లమెంట్ అధికార ప్రతినిధులు పిల్లా తనూజ, కార్యనిర్వాహక కార్యదర్శులు పలివెల లలితాదేవి, మీసాల నాగమణి, కార్యదర్శులు తుల్లి పద్మ, బండి నాగమణి, టీడీపీ సీనియర్ నాయకురాలు తురకల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా మారుతున్న డెల్టా వేరియంట్

ముంబై, జూన్ 26, (న్యూస్ పల్స్)ప్రపంచంలోని కరోనా పరిస్థితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మరోసారి తీవ్రంగా స్పందించింది. ముఖ్యంగా పేద దేశాలకు టీకా డోస్‌ల విషయంలో ఆందోళన వ్యక్తం చేసింది. డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనమ్ గ్యాబ్రియోసిస్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పేద దేశాలకు కరోనా వ్యాక్సిన్లు అందేలా చేయాలని టీకా ఉత్పత్తి చేస్తోన్న దేశాలను కోరారు. ధనిక దేశాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియ సజావుగానే సాగుతోందని, పేద దేశాలకు మాత్రం డోస్‌లు అందడం లేదని చెప్పారు. కరోనాతో ముప్పు లేని యువతకు కూడా ధనిక దేశాలు వ్యాక్సిన్లు అందిస్తుండగా అల్పాదాయ దేశాల్లో మాత్రం ఎక్కువ రిస్క్ ఉన్నవారికి కూడా టీకాలు అందడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. దీంతో ఆఫ్రికాలో పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన చెందారు. వారం రోజుల కిందటతో పోల్చి చూస్తే ప్రస్తుతం ఆఫ్రికాలో పాజిటివ్ కేసులు, మరణాలు 40 శాతం పెరిగాయని టెడ్రోస్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా డెల్టా వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలకు వ్యాక్సినేషన్ అందించడంలో విఫలమవుతున్నామని.. సరఫరా సమస్యగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఆఫ్రికా దేశాలకు వ్యాక్సిన్లు అందజేయాలని ధనిక దేశాలకు డబ్ల్యూహెచ్ఓ అధినేత విజ్ఞప్తి చేశారు. వ్యాక్సిన్ల విషయంలో వివక్ష కొనసాగుతోందని తెలిపారు. ఆఫ్రికా దేశాలు సంక్లిష్టమైన చికిత్సలను ఉపయోగించడంలేదనే వాదనలను తోసిపుచ్చిన టెడ్రోస్.. హెచ్ఐవీ/ ఎయిడ్స్ సంక్షోభంతో పోల్చారు. ఈ వైఖరి గతంలో ఉండేదని, ప్రస్తుతం సరఫరా సమస్య వేధిస్తోందని అన్నారు. కోవిడ్ వ్యాక్సిన్ వేసుకున్నా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ సూచించారు. వ్యాక్సినేషన్ పూర్తయినా సామూహిక వ్యాప్తి ముప్పు తొలగిపోదన్నారు. ప్రతి ఒక్కళ్లూ తప్పసరిగా మాస్క్ ధరించి, భౌతికదూరం నిబంధనలు పాటించాలని తెలిపారు. మరోవైపు, మిగతావాటితో పోల్చితే అభివృద్ధి చెందిన దేశాలు తమ జనాభాకు కలరా నుంచి పోలీయో వరకూ పెద్ద ఎత్తున వ్యాక్సినేషన్ కొనసాగిస్తున్నాయని డబ్ల్యూహెచ్ఓ అత్యవసర విభాగం చీఫ్ మైక్ ర్యాన్ వ్యాఖ్యానించారు. కరోనా మహమ్మారి మధ్యలో ఉన్న ప్రస్తుత తరుణంలో 'మేము మీకు ఏదైనా ఇవ్వలేం ఎందుకంటే మీరు దానిని ఉపయోగించరు అని మేము భయపడుతున్నాం' అనే పితృస్వామ్య, వలసవాద మనస్తత్వం సరైంది కాదని ర్యాన్ అన్నారు. ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్లు అందించాలన్న ఉద్దేశంతో డబ్ల్యూహెచ్‌వో ప్రారంభించిన కోవాక్స్ కార్యక్రమానికి టీకాల సరఫరాలో జాప్యం జరుగుతోంది. ఆస్ట్రాజెనికా, సీరం, జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థల నుంచి ఈ నెలలో ఒక్క డోసు కూడా అందలేదని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. కరోనా విజృంభణ నేపథ్యంలో భారత్ వ్యాక్సిన్ల ఎగుమతిని నిలిపివేసింది. దీంతో సీరం నుంచి డబ్ల్యూహెచ్‌వోకు అందాల్సిన వ్యాక్సిన్లు పెద్ద మొత్తంలో నిలిచిపోయాయి. ఫిబ్రవరి నుంచి కోవాక్స్ ద్వారా 132 దేశాలకు 90 మిలియన్ల కోవిడ్ వ్యాక్సిన్ డోస్‌లను సరఫరా చేశారు.

## ఆర్టికల్ 370 ని పునరుద్ధరించాలనే డిమాండ్ అవివేకం: ఒమర్ అబ్దుల్లా



శ్రీనగర్ జూన్ 26 జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 ని పునరుద్ధరించాలని డిమాండ్ చేయడం అవివేకం, మూర్ఖత్వమని జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ఆర్టికల్ 370 రాజకీయ ఎజెండాను నెరవేర్చడానికి బీజేపీకి 70 ఏండ్ల సమయం పట్టిందన్నారు. తమ పోరాటం ఇప్పుడే మొదలైందని, మోదీతో సమావేశాల ద్వారా ఆర్టికల్ 370 ని తిరిగి తీసుకొస్తామని చెప్పడం ప్రజలను మోసపుచ్చడమే అని పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌కు చెందిన 14 మంది సీనియర్ నాయకులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశం జరిగిన ఒక రోజు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 తిరిగి వస్తుందని ఆశించడం అవివేకమే అని ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. దానిని పునరుద్ధరించడానికి ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి సూచనలు లేవని ఆయన తెలిపారు. మూడు గంటలకు పైగా ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో ఏమీ మాట్లాడకుండా మిన్నకుండిన ఐదుగురిలో ఒమర్ అబ్దుల్లా ఒకరు. ఈయనతోపాటు నిర్మల్ సింగ్, తారాచంద్, గులాం-ఏ-మీర్, రవీందర్ రైనా కూడా ఈ సమావేశంలో ఏమీ మాట్లాడ లేదు." సమావేశంలో జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల గురించి, డీలిమిటేషన్ ప్రక్రియను వేగవంతం చేయడం గురించి, జమ్ముకశ్మీర్‌లో ఎన్నికైన ప్రభుత్వం, రాష్ట్ర హోదా ఇవ్వడం గురించి ప్రధాని స్వయంగా మాట్లాడారు" అని చెప్పారు. జిల్లా అభివృద్ధి మండలి ఎన్నికల తర్వాత ఈ సమావేశాన్ని నిర్వహించడంతో తానెంతో ఆసక్తితో ఉన్నానని, ఇది గత ఏడాది కరోనా ప్రారంభమైనప్పటి నుంచి అతిపెద్ద భౌతిక సమావేశం అని ఆయన అభిప్రాయపడ్డారు.

## మౌనమే నీ భాష నా?

ఏలూరు, జూన్ 26, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో ఒక్కోసారి మౌనంగా ఉండటమే కలసి వస్తుంది. ఇప్పుడు నీటి వివాదాలు కూడా ఏపీ ప్రభుత్వ పెద్దలు సెలెంట్ గా ఉండటం చర్చనీయాంశమైనా అది పార్టీ పరంగా ఉపయోగం ఉంటుందంటున్నారు. గత రెండేళ్లుగా జగన్ మౌనంగానే ఉంటున్నారు. ఆయన పెద్దగా బయటకు వచ్చి మాట్లాడింది లేదు. కోవిడ్ తొలిదశలో ఒక్కసారి మీడియా సమావేశం పెట్టారు. తాను చెప్పదలచుకున్నవి సభల్లోకాని, వీడియో కాన్ఫరెన్స్ లలో కాని జగన్ చెబుతున్నారు. ఇప్పుడు రాయలసీమ ఎత్తిపోతల పథకంపై తెలంగాణ నేతలు మాటల దాడి చేస్తున్నారు. అయినా జగన్ నుంచి కానీ వైసీపీ నేతల నుంచి ఎలాంటి రియాక్షన్ లేదు. తొలినాళ్లలో రోజా, శ్రీకాంత్ వంటి వారు కొంత కౌంటర్ ఇచ్చినా తర్వాత వారిని కూడా కట్టడి చేసినట్లే కనపడుతుంది. ఈ విషయంలో జగన్ వ్యూహాత్మకంగానే వెళుతున్నట్లు కన్పిస్తుంది. తెలంగాణ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆంధ్రప్రజల నుద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పద మయ్యాయి.దీంతోపాటు వైఎస్ జగన్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి లను వ్యక్తిగతంగా దూషించడం, దొంగ, గజదొంగలుగా చిత్రీకరించడం పట్ల కూడా ఏపీ ప్రజల్లో కొంత ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉమ్మడి రాష్ట్రాలన్ని విభజించడమే కాకుండా, ఇప్పుడు రాయలసీమ ప్రయోజనాలకు జగన్ పాటుపడుతుంటే తెలంగాణ నేతల అభ్యంతరమేంటని ఏపీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంటే ఏపీ ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి అండగా ఉన్నారు. ఇది చాలదుఅందుకే వైసీపీ నేతలు తెలంగాణ నేతలు ఏం మాట్లాడినా సంయమనం పాటిస్తున్నారు. దీనివల్ల పార్టీపైనా, ప్రభుత్వంపైనా సానుభూతి పెరుగుతుందన్న అంచనాలో ఉన్నారు. అందుకే తెలంగాణ నేతలు ఎంత రెచ్చిపోతున్నా జగన్ సయితం ఎటువంటి కామెంట్స్ చేయడం లేదు. తాను చేయాల్సిన పనిని చేస్తున్నారు. ఏదైనా అభ్యంతరం ఉంటే లేఖల ద్వారా తెలపాలని అధికారులకు జగన్ సూచించారు. నేతలకు కూడా జల వివాదంపై ఆచితూచి మాట్లాడాలని, అభ్యంతరకర వ్యాఖ్యలు చేయవద్దని జగన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ప్రజల్లో ఈ వివాదం ఎక్కువ కాలం నలగాలి. జగన్ కు కావాల్సిందీ అదే.

## అంకెల మార్పులతో వక్ఫ్ బోర్డు భూములు రిజిస్ట్రేషన్లు

నంద్యాల నంద్యాల జిల్లా కాబోతున్నదని ఊహాగానాలు వినిపించడముతో. నంద్యాల పట్టణంలో చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రైవేటు భూములు ఓక ఏకర 5 కోట్లు పలుకు తుంటడముతో ఇంటి స్థలాలకు విపరీతంగా డిమాండ్ పెరిగింది . భూ కబ్జా దారులు వక్ఫ భూములపై కన్ను పడింది . వక్ఫ బోర్డు అధికారులు మరియు రెవెన్యూ అధికారుల సహకారంతో సర్వే నెంబర్లను మార్చి(తప్పు గా చూపించి) రిజిస్ట్రేషన్లు మధ్య వర్తుల ద్వారా భారిగా జరిగినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి . నూనెపల్లె లో గల వక్ఫ భూములపై వీరి ద్రుష్టి పడింది . సర్వే నెంబరు 22.47.52. 228.231.233/o. 236.239. 275.278.284. సర్వే నెంబర్ ల లో 74 ఎకరాల వక్ఫ భూములను కొంత మంది నాయకుల సహకారంతో కొనుగోలు జరిగాయని తెలుస్తోంది . బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారని. ఎవరి వాటాలు వారు తీసుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి . ముస్లిం సోదరులు మాట్లాడుతూ ఇంత అన్యాయం ఎక్కడ జరిగలేదని వాపోయారు. ఆ భూములు ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం వారి కే చెందుతాయని ప్రభుత్వం పదె పదే ప్రకటనల చేస్తూనే వుందన్నారు . గతంలో కొంత మంది ముస్లిం మైనార్టీ వారు వక్ఫ భూములను ఇతరులు కొనుగోలు చేస్తున్నారని. మరియు భూ కబ్జాదారులు ఆక్రమించుకొను చున్నారని ఏన్నో ధర్నాలు నిరహర దీక్షలు చేపట్టడం జరిగిందన్నారు. అయినా ఏన్నో అక్రమాలు జరిగాయని తెలిపారు. గతంలో ఈ విషయం పై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు . కలెక్టర్ గారి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఖాళీ స్థలం లో జెండాలు పాతి ఈ భూములు వక్ఫ బోర్డు కు సంబంధించినవి అని ఎటువంటి లావాదేవీలు నడప కూడదని ఎటువంటి నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసారు. కొందరు వక్ఫ బోర్డు అధికారులు ప్రమేయం తో . రాజకీయ నాయకుల ప్రమేయం తో . అవినీతి రెవెన్యూ అధికారుల సహకారంతో భాగంగానే వక్ఫ భూములపై వెంచర్లు వేయడం మరియు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి . ఈ అవినీతిని కప్పిపుచ్చుకోవటానికి రాజకీయ నాయకులకు అధికారులకు భారిగా సొమ్ము ముట్టినదని వినిపిస్తున్నాయి . ముస్లిం మైనార్టీ పెద్దల హస్తంతోనే ఈ వ్యవహారం నడుస్తోంది అని కొంతమంది ముస్లిం మైనార్టీ సోదరుల ఆరోపణలు చేస్తున్నారు . ఏది ఏమైనా వక్ఫ భూములను కాపాడాలని పలువురు ముస్లిం మైనార్టీ సోదరులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే భూ కబ్జా దారులను అవినీతి అధికారులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు ఈ భూముల్లో పేద ముస్లిం సోదరులకు స్థలాలు కేటాయించాలని పలువురు కోరుతున్నారు. .

## బర్తడే పార్టీ కోసం కాల్ గాల్స్

గుంటూరు, జూన్ 26, (న్యూస్ పల్స్)గుంటూరు నగరంలో అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా నగరంలోని అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో ముగ్గురు యువకులు తమ స్నేహితుడి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బెంగళూరు నుంచి కాల్‌గర్ల్స్‌ను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహించినట్లు పోలీసులకు సమాచారం అందింది దీంతో రంగంలోకి దిగిన పోలీసులు హోటల్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఒకే గదిలో ఉన్న ఐదుగురు యువకులు, ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకున్నారు.యువకులను అరండల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు... అమ్మాయిలను పునరావాస కేంద్రానికి అప్పగించారు. వీరు రేవ్ పార్టీ కోసమే అమ్మాయిలను రప్పించారా? లేక హోటల్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హోటల్ నిర్వాహకులను సైతం పోలీసులు ప్రశ్నిస్తున్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు.

### జుడిషియల్ కస్టడీకి దావూద్ ఇబ్రహీం సోదరుడు ఇక్బాల్

ముంబై జూన్ 26 ముంబై సీరియల్ పేలుళ్ల సూత్రధారి, గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం సోదరుడు ఇక్బాల్ కస్కర్ ను శనివారం మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ క్రైం యాక్ట్ (మొకా) కోర్టు జుడిషియల్ కస్టడీకి పంపించింది. పోలీసుల ఇంటరాగేషన్ అనంతరం ఇక్బాల్ కస్కర్ ను జుడిషియల్ కస్టడికి తరలించారు.మాదకద్రవ్యాల రవాణాలో కస్కర్ పాత్రపై నార్కొటిక్స్ బ్యూరో అధికారి అశోక్ జైన్, దర్యాప్తు చేశారు. రెండు రోజుల రిమాండు అనంతరం కస్కర్ ను ఇంటరాగేషన్ కోసం పోలీసులు కోర్టు అనుమతి తీసుకున్నారు. అండర్ వరల్డ్ తో సంబంధాలు, ఉగ్రవాదులకు ఆర్థిక సహాయం విషయాల్లో కస్కర్ వద్ద నుంచి ముఖ్యమైన క్లూలు లభించాయని పోలీసులు చెప్పారు.

# నిరుద్యోగులను నయవంచన చేయొద్దు

నెల్లూరు జూన్ 26 (న్యూస్ పల్స్) అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ నెల్లూరు నగర శాఖ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్ లో పూర్తి స్థాయి జాబ్ క్యాలండర్ ను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి చల్లా కౌశిక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఏదో ఒక ఉద్యోగం సాధించాలనే తపనతో ఆశయంతో కుటుంబ పరిస్థితులు ఆర్థికంగా బాగ లేకపోయినా సంవత్సరాల తరబడి కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకుంటూ ఉద్యోగాల కోసం వేచి చూస్తున్న నిరుద్యోగుల ఆశలపై రాష్ట్రప్రభుత్వం నీళ్లు చల్లారని రాష్ట్ర ప్రభుత్వం మీద మండిపడ్డారు.సీఎం సార్ మోసం చేశారంటూ... 2.3 లక్షల ఉద్యోగాల పోస్టులు భర్తీ చేస్తామని నాడు హామీ ఇచ్చిన నేటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారు ,నేడు అధికారంలోకి వచ్చాక పదివేల పోస్టులకే పరిమితమవడం సిగ్గుచేటన్నారు.

**ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా కౌశిక్**

బాబు వస్తే జాబు వస్తుందని గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులను మోసం చేయడంతో గత ప్రభుత్వాన్ని గద్దె దింపినట్టే ఈ ప్రభుత్వం కూడా నిరుద్యోగులను మోసం చేస్తే అదే దుస్థితి పడుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.జాతీయ కార్యవర్గ సభ్యులు మనోజ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి గ్రూప్ 1, 2 సర్వీసులకు కలిపి 36 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. పూర్తిస్థాయి జాబ్ క్యాలండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# నార్త్ బెంగాల్ ఏర్పాటుకు డిమాండ్ : కాషాయ నేతలపై తృణమూల్ కాంగ్రెస్ ఫిర్యాదు






కోల్‌కతా : ప్రత్యేక ఉత్తర బెంగాల్ ఏర్పాటును డిమాండ్ చేసినందుకు పాలక టీఎంసీ బీజేపీ నేతలు జాన్ బర్లా, సౌమిత్రా ఖాన్‌పై ఫిర్యాదు చేసింది. బెంగాల్‌ను విడగొట్టేందుకు కాషాయ పార్టీ నేతలు ప్రయ్నతిస్తున్నారని ఆరోపించింది. నార్త్ బెంగాల్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించానలి ఎంపీ జాన్ బర్లా కోరినప్పటి నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లలో ఆయనపై నాలుగు ఫిర్యాదులు నమోదయ్యాయి.పశ్చిమ ప్రాంతంలోని జంగల్‌మహల్ ప్రాంతంలోనూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఊపందుకుంటోందని పేర్కొన్న బీజేపీ ఎంపీ సౌమిత్ర ఖాన్‌పైనా పాలక టీఎంసీ శ్రేణులు మండిపడుతున్నాయి. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం జంగల్‌మహల్ పరిధిలోని పురూలియా, బంకురా, జర్గాం జిల్లాలను దాటి బీర్భం, వర్ధమాన్, అసన్సోల్, తూర్పు పశ్చిమ మిద్నపూర్ జిల్లాలకూ పాకిందని సౌమిత్రా ఖాన్ పేర్కొన్నారు. ఇక బీజేపీ నేతలు పార్టీ విధానానికి అనుగుణంగా వ్యాఖ్యలు చేయాలని బెంగాల్ బీజేపీ చీఫ్ దిలీప్ ఘోష్ సూచించారు. అంతర్గత వేదికలపై తమ వ్యక్తిగత అభిప్రాయాలను వెల్లడించవచ్చని చెప్పారు.

# పాన్ ఆధార్ లింక్... గడువు పెంపు

న్యూఢిల్లీ, జూన్ 26 (న్యూస్ పల్స్)పాన్ కార్డు, ఆధార్ అనుసంధాన గడువును కేంద్రం మరోసారి పొడిగించింది. కరోనా వ్యాప్తి కేసుల దృష్ట్యా గడువును మరో మూడు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. పాన్ కార్డు-ఆధార్ అనుసంధానం గడువును సెప్టెంబరు 30 వరకు పొడిగిస్తున్నట్టు తాజాగా ప్రకటన చేసింది. పాన్ కార్డుతో ఆధార్ ను అనుంధానించాలని కేంద్రం ప్రజలను ఎప్పటినుంచో కోరుతోంది.

ఇప్పటికే దీనికి సంబంధించిన గడువును పొడిగిస్తూ వస్తోంది. తాజాగా మరోసారి గడువు పెంపు నిర్ణయం తీసుకుంది. గతంలో జూన్ 30 వరకు గడువు విధించగా.. అది మరికొన్నిరోజుల్లో ముగియనుంది. సెక్షన్ 139 ౦౦ ప్రకారం ప్రతి పౌరుడు తమ ఆదాయ వివరాల సమర్పణ పత్రంలోనూ, పాన్ కార్డు దరఖాస్తులోనూ ఆధార్ నెంబరు పొందపరచడం తప్పనిసరి. ఆధార్ లింక్ చేయని పాన్ కార్డులు సెప్టెంబరు 30 తర్వాత చెల్లుబాటు కావని కేంద్రం తెలిపింది.

# మీకు షుగర్ ఉందా? మీరు ప్రతిరోజూ టీ తాగుతారా?అయితే మీరు ఈ విషయం తెలుసుకోవాలి ...!




దయాబెటిస్ సాధారణంగా ఆహారం మరియు పానీయాల విషయానికి వస్తే చాలా పరిమిత ఎంపికలు ఉంటాయి. దయాబెటిస్ ఉన్నవారు రోజూ కనీసం ఒకటి నుంచి రెండు కప్పుల టీ తాగాలని అధ్యయనాలు చెబుతున్నాయి. దయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడానికి మరియు డయాబెటిస్ సంబంధిత సమస్యలను నివారించడానికి ఇవి సహాయపడతాయి. టీలో ఆరోగ్యకరమైన యాంటీఆక్సిడెంట్లు మరియు పాలీఫెనాల్స్ ఉన్నాయి. టైప్ 2 దయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడానికి ఇది సహాయపడుతుంది. బ్లాక్ టీ వంటి కొన్ని టీలు ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరుస్తాయి. అదే సమయంలో మంటను తగ్గించడానికి మరియు శరీరంలో గ్లూకోజ్‌ను నియంత్రించడానికి గ్రీన్ టీ చాలా మంచిది. కామెల్లియా సినెన్సిస్ లేదా హెర్బల్ టీల ఆకుల నుండి తయారైన టీ చాలా రకాలు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు టీ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఈ వ్యాసంలో తెలుసుకోండి. ఎన్ని కప్పులు? ఎన్ని కప్పులు? ఒక అధ్యయనం ప్రకారం రోజుకు మూడు కప్పుల టీ కంటే తక్కువ లేదా సమానంగా తాగడం టైప్ 2 దయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది. దయాబెటిస్ ఉన్న వారు అధికంగా టీ తీసుకోవడం ఇతర సమస్యలను కలిగిస్తుంది లేదా వారి గ్లూకోజ్ స్థాయిని మరింత భంగపరుస్తుంది. అదే సమయంలో దాని వినియోగాన్ని పెంచడం మధుమేహం మరియు ఇతర ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు! మీ రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడానికి ఏ పండ్లు సహాయపడతాయో మీకు తెలుసా?మధుమేహ వ్యాధిగ్రస్తులు! మీ రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడానికి ఏ పండ్లు సహాయపడతాయో మీకు తెలుసా? ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరుస్తుంది ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరుస్తుంది ఒక అధ్యయనం ప్రకారం, గ్రీన్ టీ వంటి టీ ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరుస్తుంది మరియు ఉదయం ఆహారం తీసుకోక ముందు గ్లూకోజ్ మరియు హిమోగ్లోబిన్ ౦1అ సాంద్రతలను తగ్గించడం ద్వారా గ్లూకోజ్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది. గ్రీన్ లేదా బ్లాక్ టీ ప్రిడ్నిసోన్‌లో గ్లైసెమిక్ నియంత్రణకు సహాయపడుతుంది. ప్రతిరోజూ ఉదయం పరకడుపున నిమ్మకాయ నీరు తాగితే ఏం జరుగుతుందో మీకు తెలుసా?ప్రతిరోజూ ఉదయం పరకడుపున నిమ్మకాయ నీరు తాగితే ఏం జరుగుతుందో మీకు తెలుసా? రక్తపోటును తగ్గిస్తుంది రక్తపోటును తగ్గిస్తుంది టైప్ 2 దయాబెటిస్ ఉన్న 10 మందిలో ఎనిమిది మంది మరియు టైప్ 1 దయాబెటిస్ ఉన్న 5 మందిలో 1 మందికి అధిక రక్తపోటు ఉంటుంది. రోజుకు రెండుసార్లు టీ తాగడం వల్ల శరీరంలో ఇన్సులిన్ స్థాయి తగ్గిస్తుంది. నిద్రలేమి వల్ల ఆరోగ్యానికి హాని కలిగించే దుష్ప్రభావాలునిద్రలేమి వల్ల ఆరోగ్యానికి హాని కలిగించే దుష్ప్రభావాలు గుండె జబ్బులను తగ్గిస్తుంది గుండె జబ్బులను తగ్గిస్తుంది దయాబెటిస్ మరియు గుండె జబ్బులు కలిసిపోతాయి. దయాబెటిస్ ఉన్నవారికి స్ట్రోక్ వంటి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం 60 శాతం ఎక్కువగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. దయాబెటిస్ ఉన్నవారికి టీ ఆరోగ్యకరమైన ఎంపికగా పరిగణించబడుతుంది. ఎందుకంటే ఇది రక్త ప్రవాహంలో మెరుగుదలతో మంటను నివారించడంలో సహాయపడుతుంది, ఇది గుండె పనితీరును మెరుగుపరుస్తుంది మరియు ఆరోగ్యంగా చేస్తుంది. టైప్ 2 దయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది టైప్ 2 దయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది మీకు కుటుంబంలో దయాబెటిస్ ఉంటే, సరైన రకమైన ఆహారం పాటించడం మరియు యాక్టివ్ గా ఉండటం ద్వారా మీరు దీనిని నివారించవచ్చు. నాలుగు లేదా అంతకంటే ఎక్కువ కప్పుల టీ తాగిన వారికి టైప్ 2 దయాబెటిస్ వచ్చే ప్రమాదం 20 శాతం తక్కువగా ఉందని ఒక అధ్యయనం కనుగొంది. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది అనేక అధ్యయనాలు టీని మధుమేహ వ్యాధిగ్రస్తులలో క్యాన్సర్‌ను తగ్గించే ప్రమాదానికి అనుసంధానించాయి. హైపర్గ్లేసీమియా విస్తరణను ప్రోత్సహిస్తుంది మరియు కాలేయం, రొమ్ము, ఎండోమెట్రియల్, పెద్దప్రేగు మరియు ప్యాంక్రియాటిక్ క్యాన్సర్లను అభివృద్ధి చేసే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. టీ గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది, ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. స్ట్రెస్ తగ్గిస్తుంది స్ట్రెస్ తగ్గిస్తుంది టీ ఒత్తిడిని తగ్గించడానికి ముడిపడి ఉంది. ఒత్తిడిపై అనేక శాస్త్రీయ అధ్యయనాలు నిర్వహిస్తారు.

# కివీస్‌కు క్షమాపణలు చెప్పిన ఆసీస్ కెప్టెన్

సిడ్నీ: ఆస్ట్రేలియా టెస్టు జట్టు కెప్టెన్ టిమ్ పైన్ న్యూజిలాండ్ జట్టుకు క్షమాపణలు చెప్పాడు. ఇటీవలే ఐసీసీ ప్రపంచటెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ మొదలవ్వకముందు టీమిండియానే విజేతగా నిలుస్తుందని పైన్ అంచనా వేశాడు. కానీ అతని అంచనాలకు భిన్నంగా కివీస్ సూపర్ విక్టరీ సాధించి టెస్టు చాంపియన్‌గా అవతరించింది. ఈ నేపథ్యంలో కివీస్‌ను అభినందించిన పైన్ తన అంచనా తప్పినందుకు క్షమించాలంటూ న్యూజిలాండ్‌ను కోరాడు. ccఒక్కోసారి మనం వేసుకునే అంచనాలు తప్పడం సహజమే. ఏడాదిన్నరగా టీమిండియా అద్భుత ఫామ్‌లో ఉండడంతో ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌ను భారత్ గెలుస్తుందని అంచనా వేసుకున్నా. కానీ నేను అనుకున్నదానికంటే కివీస్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. నిజానికి కివీస్‌కు కీలక మ్యాచ్‌కు ముందు ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ద్వారా మంచి ప్రాక్టీస్ లభించింది. దాన్ని సద్వినియోగం చేసుకున్న విలియమ్సన్ సేన డబ్ల్యూటీసీ ఫైనల్లో అదరగొట్టింది. ఒక చిన్న ద్వీపంలా కనిపించే కివీస్ ఈ అద్భుత ఫీట్‌ను సాధించడం ఆనందంగా ఉంది. నా అంచనా తప్పినందుకు మరోసారి క్షమాపణ అడుగుతున్నాcc అంటూ ముగించాడు. ఇదే టిమ్ పైన్ గతంలో టీమిండియా ఆసీస్ గడ్డపై టెస్టు సిరీస్‌ను గెలిచినప్పుడు.. టీమిండియా మమ్మల్ని మోసం చేసి సిరీస్ గెలిచిదంటూ వివాదాస్పద కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే

# జాన్వీ ని చిన్నచూపు చూడటానికి కారణం అదేనా..!



'అతిలోక సుందరి' శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్.. 'దఢక్' సినిమాతో హీరోయిన్ గా పరిచయమైంది. అందంలో తల్లికి ఏమాత్రం తీసిపోని జాన్వీ.. బాలీవుడ్ లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. మొదటి సినిమాతో ఊహించని ఫలితాన్ని అందుకున్న ఈ బ్యూటీ.. ఆ తర్వాత 'గుంజన్ సక్సేనా: ద కార్గిల్ గర్ల్' చిత్రంతో మెప్పించింది. అయినప్పటికీ తన ఫ్రెండ్ సారా అలీఖాన్ మాదిరిగా తక్కువ సమయంలో స్టార్ హీరోయిన్ స్టేటస్ అందుకోలేకపోయింది. జాన్వీ ని బాలీవుడ్ చిన్నచూపు చూడటానికి ప్రధాన కారణం ఆమె రెమ్యూనరేషన్ అని బీ టౌన్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.జాన్వీ కపూర్ ప్రస్తుతం ఏ సినిమాలో అయినా నటించాలంటే దాదాపు 4 కోట్ల వరకు డిమాండ్ చేస్తుందట. దీని కారణంగా కొన్ని ప్రాజెక్ట్స్ వెనక్కి వెళుతున్నాయట. జాన్వీ కి పాన్ ఇండియా వైడ్ క్రేజ్ ఉ ందనే నమ్మకంతో.. ఈమె మార్కెంటింగ్ టీమ్ కూడా ఆమె కెరీర్ ని సరైన ట్రాక్ ఎక్కించడం లేదని బాంబే సర్కిల్స్ లో టాక్ నడుస్తోంది. ఇప్పటికైనా ఈ విషయాన్ని రియలైజ్ అయ్యి.. రేటు కాస్త తగ్గించుకుంటే మరిన్ని అవకాశాలు తలుపుతడతాయని.. స్టార్ట్ హీరోయిన్ జాబితాలో చేరిపోవచ్చని కామెంట్స్ చేస్తున్నారు.ఇకపోతే 'రూహి' సినిమాతో నిరాశపరిచిన జాన్వీ కపూర్.. ప్రస్తుతం 'దోస్తానా 2' 'గుడ్ లక్ జెర్రీ' వంటి చిత్రాల్లో హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పుడు సౌత్ సినిమాల్లో నటించాడని ఈ బ్యూటీ ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. మహేష్ బాబు - ఎన్టీఆర్ - రామ్ చరణ్ లలో ఎవరో ఒకరితో అమ్మడి టాలీవుడ్ డెబ్యూ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. మరి రాబోయే రోజుల్లో జాన్వీ ని తెలుగు తెరపై చూస్తామేమో!

# మళ్లీ క్వీన్ ఆఫ్ ఝాన్సీలా గుర్రపు స్వారీ చేస్తుందా?

దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి జె.జయలలిత జీవిత కథ-తలైవిలో కంగన నటిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా 'తలైవి' తమిళ వెర్షన్ కు 'యు' సర్టిఫికేట్ ఇచ్చారు. విబ్రీ మీడియా ట్విట్టర్ లో ఈ వార్తలను అభిమానుల కోసం షేర్ చేసింది. తెలుగు- హిందీ వెర్షన్లకు సెన్సార్ షిప్ సర్టిఫికేట్ త్వరలోనే అందనుందని విబ్రి సంస్థ ప్రకటించింది.ఈ చిత్రం ఏప్రిల్ 23న విడుదల కావాల్సి ఉండగా.. కరోనావైరస్ సెకండ్ వేవ్ కారణంగా థియేట్రికల్ విడుదల వాయిదా పడింది. ఇది బహుభాషా చిత్రం. ఒకే రోజున అన్ని భాషలలో విడుదల చేయాలన్నది ప్లాన్. కానీ ఇప్పటివరకూ వీలు పడలేదు. కంగనా రనౌత్ 34 వ పుట్టినరోజు సందర్భంగా ఈ ఏడాది మార్చి 23 న ట్రైలర్ విడుదలైంది. 2 నిమిషాల 59 సెకన్ల ట్రైలర్ లో దివంగత నటి.. రాజకీయ నాయకురాలు జయలలిత జీవితంలో పలు దశలను ఆవిష్కరించారు. జయలలిత సినిమా ప్రపంచం నుండి రాజకీయ ప్రపంచానికి మారే క్రమాన్ని చూపించారు. అరవింద్ స్వామి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.జి.రామచంద్రన్ పాత్రలో నటించారు.ఓవైపు తలైవి రిలీజ్ ప్రమోషన్స్ కోసం ప్రిపేరవుతున్న కంగన .. ధాకడ్ అనే భారీ యాక్షన్ సినిమా కోసం ప్రిపరేషన్ సాగిస్తోంది. ఇదిలా ఉండగానే క్వీన్ తనకు ఎంతో ఇష్టమైన హార్స్ రైడింగ్ పై ఫోకస్ పెట్టిందని తాజాగా రివీలైన ఈ ఫోటోలు చెబుతున్నాయి.క్వీన్ కంగన పర్ఫెక్ట్ గా హార్స్ రైడింగ్ కోసం తన గుర్రాన్ని ప్రిపేర్ చేస్తోందని ఈ ఫోటో చెప్పకనే చెబుతోంది. అలా తలకు సేఫ్టీ క్యాప్ తోపాటు కళ్లకు బ్లాక్ గ్లాసెస్ ని ధరించి కౌబోయ్ డ్రెస్ లో ప్రత్యక్షమైంది. ఇంతకుముందు మణికర్ణిక- ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ కోసం గుర్రపు స్వారీ ప్రాక్టీస్ చేసిన కంగనకు ఇప్పుడు హార్స్ రైడింగ్ నిత్య వ్యాపకంగా మారినట్టే కనిపిస్తోంది. ధాకడ్ కూడా భారీ యాక్షన్ చిత్రం కాబట్టి గుర్రపు స్వారీ విన్యాసాలతో మెప్పిస్తుందేమో చూడాలి.



# సూర్యలో డైలమా! ఆ ఇద్దరిలో ఎవరిని ఫైనల్ చేశారు?

తమిళ స్టార్ హీరో సూర్య తెలుగులో స్ట్రెయిట్ మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. తెలుగు - తమిళ ద్విభాషా చిత్రం చేయాలన్నది ఆయన ప్లాన్. ఆ క్రమంలోనే మాస్ డైరెక్టర్ బోయపాటితో సూర్య ఈ మూవీ చేస్తున్నారని కథనాలొచ్చాయి.కానీ అంతలోనే బోయపాటి స్థానంలో త్రివిక్రమ్ పేరు కూడా వినిపించింది. సూర్య కోసం మాటల మాంత్రికుడు స్క్రిప్ట్ రెడీ చేస్తున్నారని ప్రచారమైంది. అయితే ఆ ఇద్దరిలో ఎవరికి సూర్య కమిటయ్యారు? అన్నదానిపై సరైన క్లారిటీ లేదు.ఇప్పుడు మరోసారి బోయపాటి శ్రీనుతో సూర్య ద్విభాషా చిత్రం చేస్తున్నారంటూ ప్రచారం మొదలైంది. కానీ దేనికీ అధికారికంగా కన్ఫర్మేషన్ లేదు. దీనిని బట్టి సూర్య ఇంకా దర్శకుడి ఎంపిక విషయంలో డైలమాలోనే ఉన్నారా? అన్న చర్చా ఫిలింసర్కిల్స్ ని వేడెక్కిస్తోంది. అధికారికంగా దీనిపై సమాచారం రావాల్సి ఉంది.ప్రస్తుతం బోయపాటి అఖండ చిత్రాన్ని తెరకెక్కిస్తూనే సూర్య కోసం స్క్రిప్టుపైనా దృష్టి సారించారని కథనాలొస్తున్నాయి. అయితే వరుసగా మాస్ సినిమాలు చేసే బోయపాటి సూర్య కోసం ఎలాంటి స్క్రిప్ట్ రాస్తున్నారు? అన్నది చూడాలి.'ఆకాశం నీ హద్దురా' లాంటి క్లాసిక్ బ్లాక్ బస్టర్ తర్వాత తమిళంలో వరుసగా సినిమాల్లో నటిస్తున్న సూర్య తెలుగు-తమిళ్ ద్విభాషా చిత్రానికి సన్నాహాలు చేయడం వెనక చాలా పెద్ద కారణమే కనిపిస్తోంది. అయితే సూర్య తొలిగా ఎవరికి అవకాశం ఇస్తున్నారు? మాస్ డైరెక్టర్ కా.. క్లాస్ డైరెక్టర్ కా.. అన్నది తేలాల్సి ఉంది.



# పెళ్లయినా కాజల్ లో ఏమాత్రం జోష్ తగ్గలేదుగా

బిజినెస్ మేన్ ఫ్రెండ్ గౌతమ్ కిచ్లుని పెళ్లాడాక కాజల్ లైఫ్ సెలబ్రేషన్ గురించి తెలిసిందే. ఈ జంట ఇంతకుముందు మాల్దీవుల విహారం నుంచి వరుస ఫోటోలను షేర్ చేయగా వైరల్ అయ్యాయి. సంసార సరిగమల ఆస్వాధనతో పాటు మరోవైపు కెరీర్ పరంగానూ ఎవరికి వారు బిజీబిజీగా ఉన్నారు.ఇక పెళ్లి తర్వాతా వరుసగా సినిమాల్లో నటిస్తూ కెరీర్ పరంగా బిజీగా ఉంది అందాల చందమామ. ఆచార్య.. భారతీయుడు 4 .. హే సినామికా లాంటి క్రేజీ చిత్రాల్లో నటిస్తోంది. అ! తర్వాత నాని నిర్మిస్తున్న మరో చిత్రంలోనూ కాజల్ నటించనుంది.ఇక ఇటీవలే కాజల్ అగర్వాల్ పుట్టినరోజు జరుపుకోగా.. ఆ స్పెషల్ డే కుటుంబం- స్నేహితులు - అభిమానులు సోషల్ మీడియాల్లో శుభాకాంక్షలు తెలిపారు. భర్త గౌతమ్ కిచ్లు తన కోసం ఒక రొమాంటిక్ నోట్ రాశారు. ప్రేమ అంటే బహుశా అలా పాప్ కార్న్ ను పంచుకోవడం గురించి.. ఎక్కువ సమయం మీతో కేటాయించడం గురించి..సుదీర్ఘ ప్రయాణాల్లో దిండుగా ఉండటం గురించి... లేదా అదే ప్రదర్శనను టెలీలో చూడటానికి అంగీకారమా... జంటగా వేడి కోకో ను పీల్చాలనుకున్నప్పుడు.. ఐస్ క్రీం గురించి ఉత్సాహపడినప్పుడు.. సూర్యోదయాన్ని చూడటానికి నిదుర లేపడం గురించి .. అయినా ఖాతరు చేయక మధ్యాహ్నం వరకు నిద్రపోవడం.. ఇదంతా ప్రేమ అని పోయెటిక్ గా రాశారు.భర్త కిచ్లుతో కాజల్ హ్యాపీ లైఫ్ ఎందరికో స్ఫూర్తి నింపుతోంది. మరోవైపు కాజల్ వరుస ఫోటోషూట్లతో ఇతర నాయికలకు గట్టి పోటీనిస్తోంది. తాజాగా కాజల్ నెవ్వర్ బిఫోర్ అనిపించే హాట్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. లేటెస్ట్ ఫోటోషూట్ లో ఆ పర్పుల్ ఫ్రాకుపై డెనిమ్ జీన్స్ కోట్ ని ధరించి కాజల్ ఎంతో స్పెషల్ గా కనిపిస్తోంది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**